TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 165 | ఎడిటర్ : ఎం. రమేష్ | గురువారం, మే 16, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## ఓటు బ్యాంక్ రాజకీయాలకు నేను దూరం

- అధిక సంతానం ఉన్నవారంటే పేదలే
- అది ఓ వర్గానికే అంటగట్టడం తగదు
- ప్రధాని మోడీ స్పష్టీకరణ

**వారణాసి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

తానెప్పుడూ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడలేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. సబ్‌కా సాథ్–సబ్‌కా వికాస్‌ను బలంగా నమ్ముతాను. నా మాటలపై జరిగిన దుష్ప్రచారం చూసి షాక్ అయ్యానని అన్నారు. తన వ్యాఖ్యలు పేదవారి అవస్థల గురించి మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలను ముస్లిం సమాజం గురించి అంటూ వక్రీకరించి జరిపిన దుష్ప్రచారం చేయడంపై ఆశ్చర్యపోయానన్నారు. చిన్నప్పుడు తమ ఇంట్లో ఈద్ పండగను కూడా నిర్వహించేవారమని ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ఎక్కువమంది పిల్లలు గురించి మాట్లాడినప్పుడు అది ముస్లింల గురించి అని ఎవరు చెప్పారని అన్నారు. పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని కుటుంబాల్లో వారి సామాజిక పరిస్థితితో సంబంధం లేకుండా అధిక సంతానం ఉంది. అది ఏ వర్గం అని నేను ప్రస్తావించలేదు. చూసుకో గలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ..వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదని మాత్రమే చెప్పాను అంటూ.. (మిగతా 2వ పేజీలో..)



## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన జగన్ సెక్యూరిటీ

- ఎన్నికల ప్రధానాధికారి మీనాకు చంద్రబాబు ఫిర్యాదు

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**



ఎన్నికల నిబంధనలను సీఎం జగన్ రెడ్డి సెక్యూరిటీ తుంగలో తొక్కారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ స్టాం÷-రగ్ రూమ్ వద్ద సీఎం సెక్యూరిటీ సిబ్బంది పార్టీ నిర్వహించారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాకి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేశారు. నాగార్జున యూనివర్సిటీ స్టాం÷-రగ్ రూమ్ వద్ద ఎన్నికల నిబంధనలను సీఎం సెక్యూరిటీ సిబ్బంది ఉల్లంఘించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సిద్ధం పోస్టర్‌తో, అధికార వైసీపీ డీజే పాటలతో పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో 450 మందికిపైగా పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ పార్టీ నిర్వహించిన సీఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీఅత్తాడ బాపూజీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరియు స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఈఓ ఎంకే మీనాను చంద్రబాబు కోరారు.

## ఏపీ ఎన్నికల్లో 81.86 శాతం పోలింగ్

- ప్రధాన ఎన్నికల అధికారిముకేశ్‌కుమార్ మీనా వెల్లడి

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**




ఏపీ ఎన్నికల్లో 81.86 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 3500 కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలు దాటాక కూడా పోలింగ్ కొనసాగిందని చెప్పారు. ఆఖరి పోలింగ్ కేంద్రంలో రాత్రి 2 గంటలకు ముగిసిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీఎంలన్నీ 350 స్టాం÷-రగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. కొన్నిచోట్ల వర్షం వల్ల పోలింగ్ ఆలస్యమైందని చెప్పారు. అబ్జర్వర్లంతా పరిశీలన చేశారని.. రీపోలింగ్‌పై ఏమీ చెప్పలేదని సీఈవో వివరించారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందని మీనా తెలిపారు. 2014లో 78.41 శాతం, 2019లో 79.77 శాతం నమోదైందని చెప్పారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో 90.91 శాతం, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదైనట్లు వివరించారు. లోక్‌సభ స్థానాల్లో అత్యధికంగా ఒంగోలులో 87.06 శాతం, అత్యల్పంగా విశాఖ లోక్‌సభలో 71.11 శాతం పోలింగ్ నమోదైనట్లు సీఈవో చెప్పారు.



## పల్నాడు జిల్లాలో 144 సెక్షన్

**విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు**

**మాచర్ల,మే15(పీపుల్స్ మోటివేషన్):**

పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలింగ్ అనంతరం జరుగుతున్న దాడుల నేపథ్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కారంపూడి, కొత్తగణెళిషునిపాడులో హింసాత్మక ఘటనలు జరిగినందున బలగాలను మోహరించారు. జిల్లాలోని మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం 19 కంపెనీల బలగాలను మోహరించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాచర్లలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కూడా అక్కడే ఉన్నారు. మాచర్లలో అడుగడుగునా పోలీసులు మోహరించారు. పట్టణంలోకి వచ్చేవారి వాహనాలను తనిఖీ చేపట్టారు. జిల్లాలో వైకాపాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురజాలలో కాసు మహేశ్‌రెడ్డి, నరసరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురి కంటే ఎక్కువమంది గుమిగూడవద్దని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. సామాన్యుల జీవనానికి ఆటంకాలు కలిగించబోమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## జార్ఖండ్‌లో మంత్రి ఆలమ్ అరెస్ట్

- ఇడి దర్యాప్తు..ఆప అరెస్ట్ ప్రకటన

**రాంచీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

మనీ లాండరింగ్ కేసులో జార్ఖాండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత అలంగీర్ ఆలమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారంనాడు అరెస్టు చేసింది. ఈ కేసులో ఆలమ్‌ను సుమారు తొమ్మిది గంటల సేపు ప్రశ్నించిన ఈడీ అధికారులు అయన నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో అరెస్టు చేసింది. మంత్రి పర్సనల్ సెక్రటరీ సంజీవ్ లాల్ ఇంటి సహాయకుడు జహంగీర్ ఆలమ్ నివాసంలో రూ.35 కోట్ల నగదును ఈడీ ఇటీవల స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆ ఇద్దరినీ అరెస్టు చేసింది. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం కోసం వేసిన టెండర్‌కు అనుమతించినందుకు ప్రతిగా రూ.35 కోట్లు కమిషన్‌గా తీసుకున్నట్టు ఈడీ అనుమానిస్తోంది. లంచం సొమ్ముకు కేర్‌టేకర్‌గా తనను ఉంచారని, ఇందుకు గాను నెలకు రూ.15,000 చొప్పున వేతనం ఇస్తున్నారని జహంగీర్ ఆలమ్ ఈడీ ప్రాథమిక ఆచరణలో అంగీకరించినట్టు తెలుస్తోంది. సంజీవ్ కుమార్ లాల్ రాంచీలోని సర్ సైయద్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్స్‌లో అద్దెకు ఉంటూ డబ్బుల కట్టలున్న బ్యాగ్‌ను తరచు జహంగీర్‌కు ఇచ్చేవాడని, అక్కడి కప్ బోర్డులో అతను ఉంచేవాడని తెలుస్తోంది. అయితే, ఎ÷-లాట్‌లో దొరికిన సొమ్ము తనది కాదని సంజీవ్ లాల్ మొదట బుకాయించాడని, జహంగీర్ ఇచ్చిన సాక్ష్యంతో ఆయనను ఏజెన్సీ అరెస్టు చేసిందని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో పట్టుబడిన సొమ్ముపై బుధవారం మధ్యాహ్నం 11 గంటలకు రాంచీలోని ఈడీ కార్యాలయానికి వచ్చిన అలంగీర్ ఆలమ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఈడీ ఆయన నుంచి సంతృప్తికరమైన సమధానం రాకపోవడంతో వెంటనే అదుపులోనికి తీసుకుంది.

## పోలింగ్ సరళి మాకే అనుకూలం

- 4న ఇండియా కూటమిదే అధికారం
- మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**లక్నో,మే15(పీపుల్స్ మోటివేషన్):**

నాలుగు విడతల్లో జరిగిన పోలింగ్ తమకే అనుకూలంగా ఉందని, దేశ ప్రజలు మోదీకి వీడ్కోలు పలకాలని నిర్ణయించారని, ఓటు ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. లక్నోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవని అన్నారు. మన భవిష్యత్ తరాలు, వాళ హక్కులు, రిజర్వేషన్లను రక్షించడానికి ప్రజలు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఇండియా అలయన్స్ పోరాడుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షిస్తేనే ప్రజలకు హక్కులుంటాయని అన్నారు. ఓటు ఉంటే ఎవరినైనా ప్రజాస్వామ్యంలో ఎన్నుకోగలమని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం ఉంటే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందని అన్నారు. బీజేపీకి బలం ఉన్న చోట తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఆపి ఏజెంట్లను మభ్యపెడుతున్నారని అన్నారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి బురఖాపై కన్నేశారని గుర్తు చేశారు. దేశానికి ఎన్నో ఇచ్చామని చెబుతూ బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. 'గాంధీజీ స్వాతంత్య్రం తెచ్చారు, నెహ్రూజీ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సృష్టించారు.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారు..'అని అన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నా మోదీ మౌనంగా కూర్చున్నారని, అలా మాట్లాడటం దేశద్రోహమని అనలేదని ఆరోపించారు



## పివోకె ఎప్పటికీ భారత్‌లో భాగమే

- దానిని విలీనం చేసుకోవడమే తరవాయి
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ

**కోల్‌కతా,మే15(పీపుల్స్ మోటివేషన్):**



పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోమారు స్పష్టం చేశారు. దీనిని భారత్‌లో విలీనం చేస్తామని ప్రకటించారు. బుధవారం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలను ప్రస్తావిస్తూ.. పీవోకే భారత్‌లో భాగమే. మేం దానిని తీసుకుంటామని అన్నారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఒకప్పుడు సమస్యాత్మకమైన కాశ్మీర్‌లో శాంతి నెలకొందని పశ్చిమ బెంగాల్ సేరంపోరే నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా ప్రసంగించారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఆజాదీ నినాదాలు, నిరసనలతో ప్రతిధ్వనిస్తుంది. 2019లో ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించింది. అయితే ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు జరుగుతున్నాయి. ఇంతకుముందు ఇక్కడ ఆజాదీ నినాదాలు వినిపించగా, ఇప్పుడు పీఓకేలో కూడా అదే నినాదాలు వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు ఇక్కడ రాళ్లు రువ్వేవారని, ఇప్పుడు పీఓకేలో రాళ్లు రువ్వుతున్నారు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చొరబాటుదారులు కావాలా లేదా శరణార్థులకు సీఏఏ కావాలా అనేది పశ్చిమ బెంగాల్ నిర్ణయించుకోవాలి. జిహాద్‌కు ఓటు వేయాలా లేదా వికాస్‌కు ఓటు వేయాలా అనేది బెంగాల్ నిర్ణయించుకోవాలి అని అమిత్ షా పిలునిచ్చారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# ఓటు బ్యాంక్ రాజకీయాలకు నేను దూరం

(మొదటి పేజీ తరువాయి)

మోదీ స్పష్టత ఇచ్చారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో అల్లర్లు జరిగినప్పుడు మోదీ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తన ప్రత్యర్థులు ముస్లిం వర్గంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని దుయ్యబట్టారు. 'చిన్నప్పుడు మా ఇంటి చుట్టుపక్కల ఎన్నో ముస్లిం కుటుంబాలు ఉండేవి. మా ఇంట్లో కూడా మిగతా పండగలతో పాటు ఈద్ కూడా నిర్వహించేవాళ్లం. ఈద్ రోజున మా ఇంట్లో వంట చేసుకునేవాళ్లం కాదు. ఆ వర్గానికి చెందిన కుటుంబాలే మాకు ఆహారం తెచ్చిఇచ్చేవి. అలాగే మొహర్రంలోనూ భాగమయ్యేవాళ్లం. అలాంటి ప్రపంచంలో నేను పెరిగాను. నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారని వెల్లడించారు. అలాగే ఈ ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించగా..ఈ దేశ ప్రజలు తనకు ఓటు వేస్తారని సమాధానం ఇచ్చారు. హిందూ-ముస్లిం అంటూ తేడా చూపడం ప్రారంభించిన రోజు.. ప్రజాజీవితంలో ఉండే అర్హత తనకు ఉండదన్నారు. అలాంటి తేడా ఎన్నటికీ చూపనంటూ ప్రతిజ్ఞ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. 'ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఆ మేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు. మీ ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉందా? అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న ఆ పార్టీ నాయకులు మహిళల మంగళ సూత్రాలను కూడా వదలరు. మీ కష్టార్జితం చొరబాటుదారుల పాలవడం మీకు సమ్మతమేనా?' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై ప్రధాని మోడీ విమర్శలకు వివరణ ఇచ్చారు.

# తాడిపత్రి అల్లర్లలో జెసి ప్రభాకర్‌కు అస్వస్థత

- టియర్ గ్యాస్‌తో ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్
- హైదరాబాద్ కిమ్స్‌కు తరలించి చికిత్స

**అనంతపురం,మే15(పీపుల్స్ మోటివేషన్):**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మంగళవారం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దాని ప్రభావంతో మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని ఆయన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వైద్య నిర్ధరణ పరీక్షలు పూర్తయిన తర్వాత బులెటిన్ విడుదల చేస్తామని వైద్యులు ప్రకటించారు. టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తాడిపత్రిలో టియర్ గ్యాస్ ఎఫెక్ట్ వల్లే జేసీ అనారోగ్యానికి గురయ్యారు. ఆందోళన కారులను చెదరగొట్టడంలో భాగంగా నిన్న కాంచన ఆసుపత్రి సమీపంలో పోలీసులు టీయర్ గ్యాస్ ప్రయోగించారు. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి సమీపంలో టియర్ గ్యాస్ పడింది. దీంతో టియర్ గ్యాస్ ఎఫెక్ట్‌తో జేసీ లంగ్స్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి చికిత్స పొందుతున్నారు.ఏపీలో ఎన్నికలు ముగిసినప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ నేతలు పరస్పరం రాళ్ల దాడికి దిగారు. టీడీపీ నేత సూర్యముని ఇంటిపై వైసీపీ రాళ్ల దాడి చేయడాన్ని జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటివైపు వేలాది మంది టీడీపీ కార్యకర్తలతో బయలుదేరిన జేసీని పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ జేసీ ముందుకు సాగడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో తాడిపత్రిలో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# భూమా అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్‌పై దాడి

- తప్పించుకోవడంతో దక్కిన ప్రాణాలు
- నంద్యాల ఆస్పత్రిలో చకిత్స

**ఆళ్లగడ్డ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్‌పై హత్యాయత్నం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటుచేసుకుంది. అఖిలప్రియ ఇంటి ముందు నిఖిల్ నిలుచుని ఉండగా.. కారుతో దుండగులు ఆయన్ను ఢీకొట్టారు. అనంతరం ముగ్గురు వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. నిఖిల్ వారి నుంచి తప్పించుకుని అఖిలప్రియ ఇంట్లోకి వెళ్లిపోయారు. తీవ్రగాయాలతో ఉన్న అతడిని నంద్యాలలోని ఆస్పత్రికి తరలించారు. నిఖిల్‌ను కారుతో ఢీకొట్టిన దృశ్యాలను అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. గతంలో నంద్యాలలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సమయంలో తెదేపా నేత ఏవీ సుబ్బారెడ్డిపై నిఖిల్ దాడి చేశాడు. ఈ నేపథ్యంలోనే ఆయన వర్గీయులు తిరిగి దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనతో నేతల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏవీ సుబ్బారెడ్డి, చంద్రతో పాటు మరో నలుగురిపై ఆళ్లగడ్డ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# డోన్‌లో ఓటర్లు మార్పు కోరుతున్నారా?

- ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయా ?
- అభివృద్ధి మంత్రం పనిచేస్తుందా ..? పోలింగ్‌లో ఎవరికి అనుకూలంగా ఉన్నారో..
- వైసిపికి హ్యాండ్ ఇచ్చిందెవరు కూటమికి మద్దతు ఇచ్చిందెవరు..!
- మూడు మండలాలలో ఓటర్ మద్దతు ఎవరికి పలికారో..





**డోన్ (పీపుల్స్ మోటివేషన్):-**

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ డోన్ నియోజకవర్గంలో ఎవరికి అనుకూలం అంటూ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలలో ఉత్కంఠతో పాటు సామాన్య ప్రజలు కూడా సమాలోచనాలతో జోరుగా చర్చించుకుంటున్నారు ముఖ్యంగా మూడు మండలాలలో జరిగిన పోలింగ్ శాతం పెరగటంతో ఇప్పుడు ఒకటే చర్చ... వ్యతిరేక పవనాలా లేక అనుకూల పవనాలా అంటూనే... అయితే ఈ సారి మాత్రం డోన్ నియోజకవర్గం లో మార్పు తప్పదని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తూ మండలాల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. వైసిపి తరుపున ప్రస్తుత ఆర్థిక మంత్రి బుగ్గన, కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్ పి కోట్ల ప్రకాష్ రెడ్డి బరిలో ఉన్నారు. సైకిల్ స్పీడ్ పెంచనున్నారా లేక ఫ్యాన్ వేగం పెంచనున్నారా అన్నది తేలేందుకు జూన్ 4 వరకు వేచి చూడవలసిందే. అయితే ప్రస్తుత పరిస్థితి చూస్తే మార్పు తప్పదనే పలువురి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**వైసిపికి హ్యాండ్ ఇచ్చిందెవరు?**

**ఫ్యాన్ వేగానికి అడ్డు పడిందెవరు..**

డోన్ నియోజకవర్గంలో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో పలువురు మనస్తాపంతో వైసీపీకి హ్యాండ్ ఇచ్చారని స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని మూడు మండలాలలో అధిక ఓటు బ్యాంక్ ఉన్న కాపు సామాజిక వర్గం, వైశ్య సామజిక వర్గం వైసీపీకి బలమైన శక్తిగా ఎప్పుడూ అండగా ఉంటూ ధైర్యాన్ని ఇస్తూ వచ్చింది. అయితే గత ఐదేళ్లలో ప్రతి మండలంలోని ఎదురు ప్రశ్నించని కొందరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ, మిగిలిన వారికి అందుబాటులో ఉండక ఆశించిన వారికి ఎటువంటి న్యాయం చేయకపోవడం, చుట్టూ ఉన్న వారిని తప్ప మిగిలిన వారిని విస్మరించడంతో, కుల సంఘాల నాయకులు కొందరు సంఘీయులకే కొమ్ము కాస్తూ మిగిలిన సంఘీయులను విస్మరిస్తూ తాము మాత్రమే గొప్ప అని చెప్పుకుంటూ ఉండటంతో ఈసారి ఎన్నికల్లో పలువురు కాపు, వైశ్య, బి సి,సామాజిక వర్గం నేతలు, ఇతర అసమ్మతి నేతలు మనస్తాపంతో ప్రచారానికి దూరంగా ఉండడం, క్యాడరుకు మీ ఇష్టం అని చెప్పడంతో వైసిపి కి మాత్రం భారీగానే నష్టం చేకూరే అవకాశం మెండుగా ఉంది. ముఖ్యంగా గతంలో ఎవరి బలం అయితే వైసీపీకి అండగా నిలిచిందో అదే బలం ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి గెలుపు పై అనుమానాలు రేకెత్తేలా చేసింది. టిడిపి ఇన్చార్జిగా ఉన్న ధర్మారం సుబ్బారెడ్డిని మారుస్తూ కోట్లను అభ్యర్థిగా ప్రకటిస్తూ బాధ్యతలు ఇవ్వటంతో పలువురు వారి వర్గీయులు ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఉన్న పరిచయాలతో కాంగ్రెస్ పార్టీలో పలువురి తో ఉన్న వ్యక్తిగత పరిచయాలతో వర్గం పెరిగిందని ఆ వర్గమే నేడు ఆశావాహికగా మార్పు తెస్తుందని అభిప్రాయపడుతున్నారు. మరి చూడాలి జూన్ 4వ తేదీన వెలువడే ఫలితాలలో ఎవరు ఎక్కడ వైసీపీకి హ్యాండ్ ఇచ్చి, కూటమికి మద్దతు పలికారు స్పష్టంగా తెలిసిపోతుంది.

**మూడు మండలాలలోనూ ఎవరికి మెజార్టీ?..**

డోన్ నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందని అందరూ లెక్కలు కడుతున్నారు. ప్యాపిలి మండలం లో టీడీపీ అభ్యర్థికి భారీ మెజార్టీ వస్తుందని, అలాగే ప్యాపిలి మండలంలో కూడా మంచి మెజార్టీ వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక డోన్ అర్బన్ లో నువ్వా నేనా అనేలా ఎన్నికలు జరిగినా టీడీపీ కే మెజార్టీ వస్తుందని, టిడిపి నాయకుల కృషితో ఇక్కడ మెజార్టీ కచ్చితంగా వస్తుందని పలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి కంచుకోటలైన డోన్, బేతంచెర్ల మండలాలలో ఈసారి వైకాపాకు గత ఎన్నికల్లో వచ్చినట్లు భారీ మెజార్టీ సాధ్యం కాదని, ముఖ్యంగా ప్యాపిలి మండలంలో కూటమి భారీగా బలపడడం, అందుకు అనుగుణంగా చాలామంది వైకాపా నాయకులు అంటీ ముట్టినట్లు వ్యవహరించడంతో ప్యాపిలి మండలంలో ఈసారి హెరాహెరీరి తప్పదని పలు వురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక డోన్ రూరల్ కూడా నువ్వా నేనా అనే రీతిలో ఎన్నికలు జరిగినా వైసీపీకి స్వల్ప మెజార్టీ వస్తుంది కానీ గత వైభవం మాత్రం దక్కదని పలువురు చర్చించుకుంటున్నారు. మరి ఈ మూడు మండలాల లెక్కలను, ఓటర్ల అభిప్రాయాలను, నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటే ఈసారి డోన్ నియోజకవర్గంలో మార్పు ఖాయమని సంకేతాలు, అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలపై ఆశలు పెట్టుకొని అలాగే 40 సంవత్సరాల చరిత్రలో ఇటువంటి అభివృద్ధి ఎప్పుడు జరగలేదని ఒక బుగ్గన రాజేంద్రనాథ్ మాత్రమే అభివృద్ధి చేశాడని ఎన్నికల బరిలోకి దిగిన వైకాపాకు సంక్షేమ పథకాల లబ్దిదారులు మద్దతు ఇచ్చారో లేక కూటమి వైపు మొగ్గు చూపారో తెలియాలంటే జూన్ 4 వరకు వేచి ఉండవలసిందే. మరి ఎవరి అంచనాలు ఎలా ఉన్నా, ఎవరి లెక్కలు ఎలా ఉన్నా ఓటర్ దేవుళ్ల ఆశీర్వాదం ఎవరికి దక్కిందో ఇప్పటికే చాలామంది నాయకులకు స్పష్టమైన సమాచారం ఉన్న లెక్కలతో సహా బయటపడాలంటే మూడు వారాలు ఆగాల్సిందే. మరి జూన్ 4వ తేదీ సైకిల్ స్పీడా లేక ఫ్యాన్ జోరు డోన్ లో కొనసాగుతుందో వేచి చూద్దాం.

# సీమ సుధాకర్ రెడ్డి అరెస్టు బయటపడ్డ 'కోట్ల' అజ్ఞానం : బుగ్గన రాజారెడ్డి

**డోన్ (పీపుల్స్ మోటివేషన్):-**

ఎస్సీ ఎస్టీ కేసులో అరెస్టు అయిన సీమ సుధాకర్ రెడ్డి విషయంలో కోట్ల సుజాతమ్మ కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిలు చేస్తున్న ఒక తప్పుడు ప్రచారం వారు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి నుంచి కళ్ళు తెరిపించేందుకు నోట్ రిలీజ్ చేస్తున్న. ఎందుకు పోలీసులు అరెస్ట్ చేశారు? గార్లదిన్నెలో దళితులపై జరిపిన దాడిలో %ంఎ/ా% కేసు నమోదైంది.

**ఎప్పుడు దాడి జరిగింది?**

ఫిబ్రవరి 14, 2024

**అప్పుడు మీరు ఎక్కడున్నారు?**

ఆలూరులో తిరుగుతూ డోన్ సంబంధం లేకుండా ఉన్నారు.

**ఎస్సీ ఎస్టీ కేసులో ఫిర్యాదుదారుడు ఎవరు**

తెలుగుదేశం పార్టీ మద్దతు దారుడు

**కేసు అక్రమమా...**

సూదకరరెడ్డి ఫిబ్రవరి 14 ఎక్కడున్నారు. మీరు ఎక్కడున్నారు. టీడీపీ మద్దతుదారుడు పిర్యాది బాధితుడు.... కేసు అక్రమనమోదు అంటే మీరు ఎంతటి అవివేకులో అర్థమవుతుంది.

**అరెస్ట్‌లో పోలీస్ పాత్ర**

తమపై దాడి చేసిన సుధాకర్ రెడ్డిని అరెస్టు చేయడం లేదని దళితులైన టిడిపి మద్దతుదారులు ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆశ్రయించారు

**ఇన్ని రోజులు ఎందుకు అరెస్ట్ చేయలేదు.**

దళితుల ఫిర్యాదుతో డిఎస్పీకి కమిషన్ నుంచి కమిషన్ నుంచి తాత్సర్యం చేస్తున్నారంటూ తాఖీదు ఎందుకు అరెస్ట్ ఆలస్యం ప్రజాస్వామ్యంలో పార్టీల కతీతంగా అందరికీ సమాన అవకాశాలు స్వేచ్ఛాయిత వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో పోలీసులు సమయమనాన్ని పాటించి ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత అరెస్టు కార్యక్రమాన్ని చేపట్టారు.

**మీ అజ్ఞానం, అవివేకం ఏంటి**

ఘటన జరిగినప్పుడు ఏమీ తెలియని మీరు టిడిపి మద్దతుదారుడు ఫిర్యాదుకి మీరు ఇస్తున్న గౌరవం, దళితుల పట్ల మీకున్న వైఖరి ఈ ఒక్క సంఘటనతో నియోజకవర్గ ప్రజలందరికీ భట్టబయలైంది. ఏ తప్పు చేసిన నీ పంచన ఉంటే అది రైట్ అయిపోతుంది అవతల దళితుడైన టిడిపి మద్దతు దారుడైన

**నాపై పెట్టిన తప్పుడు కేసు గురించి**

పీఎం బాబుతో ఒక తప్పుడు ఫిర్యాదును ఫ్రేమ్ చేయించి నాపై అక్రమ కేసు బనాయించి మీ నిజ స్వరూపం బయటపెట్టారు.

పీఎన్ బాబు ఎవరు?

రిటైర్డ్ డీఎస్పీ/ఏఎస్పీ

**ఆయనతో మీ సంబంధమేమి?**

డిఎస్పీగా విధులను నిర్వహిస్తూ ఒక వ్యభిచారం గృహంలో వేశ్యతో కలిసి పట్టుబడి సస్పెండ్ అయ్యి మీ పంచన చేరాడు.

**పీఎన్ బాబుకు మీరు ఎలాంటి అండ**

దాదాపు మూడు సంవత్సరాల పాటు ముఖ్యమంత్రితో విభేదించి గడపదొక్కనని ప్రతిజ్ఞ చేసిన నీవు వేశ్యతో పట్టుబడ్డ విటుడైన డీఎస్పీ సస్పెండ్ revoke చేయించేందుకు సీఎం దగ్గరకు వెళ్లి ప్రాధేయపడి సస్పెండ్ ని తీపించావు.

**డోన్లోనే ఎందుకు పోటీ?**

పీఎం బాబు సొంత ఊరు డోలు కాదు సొంత జిల్లా కాదు దీనికోసం చేశారు పోటీ ఏ పార్టీ తరఫున పోటీ చేశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏం చేశారు ఈయన ఒక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తూ నా వెహికల్ వెంట ఫాలో కావడం ఇది ఈయన డ్యూటీ.

**దాడి ఎక్కడ జరిగింది**

మా ఇంటి ముందు. స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నీకు నా ఇంటి ముందు ఏం పని.

మిమ్మల్ని చూస్తే చాలా బాధేస్తుంది. కళ్లకు కట్టినట్లుగా పూసగుచ్చినట్టుగా పిన్ టు పిన్ జరిగిన విషయాలను చెబుతున్న అజ్ఞానంతో అవివేకంతో కళ్ళుమూసుకుని మీరు చేస్తున్నది ఏంటి.... ఎన్ని రోజులు మీరు రాజకీయం ఎలా చేశారు...... జనం ఎలా మిమ్మల్ని భరించారు

**మీరు చేయాల్సిందేంటి..?**

తప్పుడు సలహాలు సూచనలు మానుకొని జనంలో పలచబడే దానికంటే లిసొంత ఊరికి మంచి తారు రోడ్డు వేసుకోవాలని నా సలహా... అని బుగ్గన రాజారెడ్డి రాసిన విడుదల చేశారు.

# ప్రధాని మోడీ నామినేషన్ కార్యక్రమం

- ఆహ్వానం అందించినందుకు పవన్ కృతజ్ఞతలు

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నామినేషన్ కార్యక్రమానికి తమను ఆహ్వానించినందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో అత్యంత పవిత్ర పుణ్య క్షేత్రం, శైవ క్షేత్రమైన వారణాశిలో నరేంద్ర మోదీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి నన్ను ఆహ్వానించినందుకు నా కృతజ్ఞతలని అన్నారు. ముఖ్యంగా కాశీలోని విశ్వేశ్వరునికి అభిషేకం, ఆ దివ్య క్షేత్రం సందర్శనకు సహకారం అందించిన బీజేపీ ఉత్తరప్రదేశ్ శాఖ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగనే తన పర్యటన భక్తిపూర్వకంగా సాగడానికి వెన్నంటి ఉన్న యూపీ రాష్ట్ర అటవీ శాఖా మంత్రి అరుణ్ కుమార్ సక్సేనాకు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. బీజేపీ నాయకత్వానికి, ఉత్తర్‌ప్రదేశ్ అటవీశాఖ మంత్రి అరుణ్ కుమార్ సక్సేనాకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా.. వారణాసి లోక్‌సభ అభ్యర్థిగా ప్రధాన మంత్రి మోదీ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, 12 రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కూటమి నేతలు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద స్ట్రాంగ్ సెక్యూరిటి





- జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్
- స్ట్రాంగ్ రూమ్‌ల సిసికెమెరాల కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**కర్నూలు, మే 15 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు రాయలసీమ యూనివర్సిటిలో 3 బ్లాకులలో, 16 స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత ను కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ బుధవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ల యొక్క మూడంచెల భద్రతలో మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ స్థాయిలో ఆర్మ్‌డు రిజర్వుడు బలగాలు, తృతీయ స్ధాయిలో సివిల్ పోలీసు బలగాలను మోహరింపచేశాము. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రతి స్ట్రాంగ్ రూమ్, పరిసరాలలో సిసిటివి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచాము. ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశాము. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్ధాయి అధికారులను ఇంచార్జీలుగా నియమించాము. ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజన్లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ లు కూడా ఏర్పాటు చేశాం. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పరిచిన కేంద్రాల ఎంట్రెన్స్ గేట్ లోపలికి, పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు లేదా అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలకు అనుమతిలేదు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఔటర్ పెరిమీటర్ వరకు మాత్రమే వెళ్ళాలి. రిటర్నింగ్ అధికారులు ఇన్నర్ పెరిమిటర్ వరకు వెళ్ళాలి. స్ట్రాంగ్ రూమ్‌కి ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయబడింది. స్ట్రాంగ్ రూం 24 గంటలూ సాయుధ బలగాల రక్షణలో ఉంటుంది, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడుతుంది. స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)కి కనెక్ట్ చేయబడ్డాయి. పారదర్శకంగా, అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టాము. స్ట్రాంగ్ రూమ్‌లకు సీసీటీవీ కవరేజీతో సహా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ అధికారులతో పాటు, పోలీసు అధికారులు 24 గంటలూ డ్యూటీలో ఉండే విధంగా చర్యలు చేపట్టాం. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు సెక్యూరిటీ మరియు కారిడార్ మొదలైన వాటి యొక్క సీల్డ్ వేసిన డోర్‌లను కవర్ చేసే విధంగా సీసీటీవీ కవరేజ్/వీడియోగ్రఫీ ఏర్పాటు చేశాము. స్ట్రాంగ్ రూమ్‌లు తెరిచే ముందు మరియు మూసివేసే సమయంలో సీసీటీవీ కవరేజ్/వీడియోగ్రఫీ మొత్తం సీలింగ్ ప్రక్రియ స్పష్టంగా కనిపించే విధంగా సిసిటివీలు ఏర్పాటు చేశాం. సీసీటీవీ ఫుటేజీ డేటా నిల్వ ఉండే సీసీటీవీ కెమెరాలు అమర్చాము. ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ దగ్గర విజిట్ చేసిన అధికారులు రిజిస్టర్ / లాగ్-బుక్ లో సంతకాలు చేసే విధంగా ఏర్పాటు చేశాము. ఇందులో పరిశీలకులుగా జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీ లేదా ఆ పై స్థాయి అధికారులు ఉంటారు. జిల్లా ఎన్నికల అధికారి నుండి ఎప్పటికప్పుడు నివేదికను చీఫ్ ఎలక్షన్ కమిషన్ అధికారికి పంపబడుతుంది. రాజకీయ పార్టీల అభ్యర్థులు, పుకార్లు, అపోహలను నమ్మవద్దు. తొందరపడకుండా నిర్ధారణకు అవసరమైతే ఎలక్షన్ కమిషన్ దృష్టి కి తీసుకువెళ్ళాలి. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి జిల్లాలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటాము. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్ల పై ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ వెంట కర్నూలు డిఎస్పీ కె. విజయశేఖర్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాస రెడ్డి, కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, ట్రాఫిక్ సిఐ గౌతమి, ఆర్ ఐలు ఉన్నారు.



# ఘనంగా నక్కిరామన్న 35 వ వర్ధంతి వేడుకలు

**బేతంచర్ల, మే15 (పీపుల్స్ మోటివేషన్):-**

నక్కి రామన్న 35వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య,లు మాట్లాడుతూ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాడిన నక్కి రామన్న ఆశయాలకు కృషి చేస్తామని అన్నారు బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలోని మండల కార్యదర్శి ఎన్న భార్గవ్, ఆధ్వర్యంలోనక్కీ రామన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేష్,దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఎల్ల కృష్ణ, కార్తీక్, ప్రదీప్ సాయి, రాజా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




# ఆలూరు నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదములు

- ఆలూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

**ఆలూరు, మే 15 (పీపుల్స్ మోటివేషన్):-**




బుధవారం ఆలూరు నియోజకవర్గం పార్టీ కేంద్ర కార్యాలయంలో విరుపాక్షి విలేకరులతో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం లో ప్రజలు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించి నందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యే గాను ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలకు అధికారులకు శ్రేయోభిలాషులకు మీడియా మిత్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈరోజు వైయస్సార్ పార్టీ కార్యాలయంలో సోమవారం రోజు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సజావుగా జరిగేందుకు కృషిచేసిన పోలీస్ అధికారులకు అలాగే ఓటు వేసి సహకరించిన ప్రతి ఒక్కరూ మిత్రులకు అభినందనలు తెలియజేశారు జూన్ 4న వైసీపీ ప్రభంజనంతో జనం ఆనందోత్సవాల్లో మునిగి తేలుతారు. వైసీపీ ప్రభంజనం రాష్ట్రమంతా సృష్టిస్తుందనిజగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తిరిగి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందజేసి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పడు అందిస్తారని ఓటరు దేవుళ్ళు కరుణించి ఓటు వేసినందుకు పైగా భగవంతుడు కరుణించి వర్షం రూపంలో ఆశీర్వదించినందుకు తాను మీ అందరికీ కృతజ్ఞతలు అన్నారు మీ అందరి సహకారంతో ఆలూరు నియోజకవర్గం సేవకుడిగా మీకోసం పనిచేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో ఆరు మండలలో కన్వీనర్లు జెడ్పిటిసిలు ఎంపీపీలు సొసైటీ చైర్మన్లు జెసీఎస్ కన్వీనర్లు సర్పంచులు ఎంపీటీసీలు అన్ని మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగు వ్యక్తి పోటీ

**లండన్,మే15(పీపుల్స్ మోటివేషన్):**

బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి తెలుగు వ్యక్తి ఎంపికయ్యారు. అతను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరంకు చెందిన ఉదయ్ నాగరాజు. యూకేలోని లేబర్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. నార్త్ బెడ్ ఫోర్డ్గ్ ÷ర్ లేబర్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించింది. నార్త్ బెడ్ ఫోర్డ్గ్ ÷ర్ అనేది అక్కడి బౌండరీ కమిషన్ సూచనతో కొత్తగా ఏర్పడ్డ పార్లమెంట్ నియోజకవర్గం. అయితే, యూకేలోని ప్రఖ్యాత సర్వే సంస్థ ఎలెక్టోరల్ కాల్కులస్ ప‌క్రారం నియోజకవర్గంలో 68 శాతం లేబర్ పార్టీ గెలువబోతుందని అంచనా వేసింది. ప్రస్తుతం బ్రిటన్ లోనూ ఎన్నికల హడావిడి మొదలయింది. భారతదేశంలో ఇప్పటికే ఎన్నికలు జరుగుతుండగా ఈ సంవత్సరంలోనే బ్రిటన్, అమెరికాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ - పాలస్తీనా సంఘర్షణ, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో జరుగుతున్న బ్రిటన్, అమెరికా ఎన్నికల మీద ప్రపంచ దేశాల దృష్టి ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్ నాగరాజు జన్మించారు. శనిగరం గ్రామానికి చెందిన నాగరాజు హనుమంతరావు, నిర్మలాదేవి దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచే కష్టపడేతత్వం కలిగి ఉండే ఉదయ్ అంచెలంచాలుగా ఎదిగారు. బ్రిటన్ లోని ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ కాలేజీ అఫ్ లండన్ లో పాలనా శాస్త్రంలో పీజీ చేశారు. ప్రపంచ సమాజం, భావితరాలపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రభావం ముందుగానే పసిగట్టి ఏఐ పాలసీలాబ్స్ అనే థింక్-ట్యాంక్ ని నెలకొల్పారు. అంతర్జాతీయ వక్తగా, రచయితగా మంచి పేరు సంపాదించారు ఉదయ నాగరాజు. క్షేతస్థాయి సమస్యలపైన ఉదయ్ కు మంచి పట్టు ఉంది. స్కూల్ గవర్నర్ గా, వాలంటీర్ గా, విస్తృత రాజకీయ ప్రచారకుడిగా ఒక దశాబ్దకాలంగా ఇంటింటికీ ప్రచారంతో సామాన్యుల కష్టాలపై మంచి అవగాహన సాధించారు. దాదాపు అన్ని సర్వే సంస్థల ప‌క్రారం ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని నెలకొల్పనుంది. ప్రఖ్యాత తెలుగు రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా ఈ సర్వేల ఆధారంగా కన్సర్వేటివ్ పార్టీ కనీవిని ఎరుగని రీతిలో ఓడిపోయి లేబర్ పార్టీ గెలుస్తుందని విశ్లేషించారు. గత కొన్ని ఎన్నికల్లోనూ లేబర్ పార్టీ ఎంపీలు వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఈ నెల జరిగిన కౌన్సిలర్, రాష్ట్ర మేయర్ ఎన్నికలోనూ లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. దీనితో తెలుగు బిడ్డ ఉదయ్ నాగరాజు కూడా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తుంది.

# హైదరాబాద్‌లో బాహాటంగా రిగ్గింగ్


- రీ పోలింగ్ జరపాల్సిందే
- బిజెపి అభ్యర్థి మాధవీలత డిమాండ్

**హైదరబాద్,మే15(పీపుల్స్ మోటివేషన్):**

హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎం నేతలు అక్రమ రిగ్గింగ్ కు పాల్పడ్డారని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఆరోపించారు. రిగ్గింగ్‌తో గెలవాలనుకోవడం కూడా ఓ గెలుపేనా అని విమర్శలు సంధించారు. బుధవారంఆమె మీడియాతో మాట్లాడుతూ.. రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా ఒక గెలుపేనా అని విమర్శించారు. 16 సంవత్సరాల ముస్లిం బాలిక రెండుసార్లు ఓటు వేయడానికి వచ్చి దొరికిందని, ఆ బాలిక పై కేసు నమోదు చేయకుండా తల్లితండ్రులకు అప్పగించి పంపించారని ఆమె ఆరోపించారు. రిగ్గింగ్ ఆపడానికి వెళ్లిన నాపై వేల మంది రౌడి మూకలు దాడికి యత్నించారని, రిగ్గింగ్ జరుగుతున్నా అక్కడ ఉన్న పోలీసులు స్పందించలేదని మాధవీ లత మండిపడ్డారు. ఇది భారత దేశమేనా.. ఇక్కడ 144 సెక్షన్ ఉండదా..? అని ఆమె ప్రశ్నించారు. ఈ రిగ్గింగ్ పై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అవసరమైతే రీ పోలింగ్ పెట్టడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని ఆమె వెల్లడించారు. రేపు ముంబైలో ప్రచారానికి వెళ్ళాలని పార్టీ ఆదేశించిందని అక్కడికి వెళ్తున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే.. పోలింగ్ రోజు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో పర్యటించిన మాధవీలత.. రిగ్గింగ్ జరుగుతుందనే అనుమానంతో ఓ ముస్లిం మహిళను బుర్ఖా తీసి ఆమె ముఖాన్ని ఓటర్ స్లిప్‌లో ఉన్న ఫొటోతో సరిపోల్చి చూశారు. ఈ ఘటన వివాదస్పదంగా మారడంతో కన్నెర్రజేసిన ఈసీ.. ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాలకు ఆమెపై మలక్ పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగానే.. హైదరాబాద్‌లో రిగ్గింగ్ జరిగిందని.. రీ పోలింగ్ నిర్వహించాలని మాధవీలత డిమాండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె డిమాండ్‌పై ఈసీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందనేది స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఆలూరు నియోజకవర్గం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన వీరభద్ర గౌడ్

**ఆలూరు, మే 10 (పీపుల్స్ మోటివేషన్):-**



మునుపెన్నడు రాణి విధంగా 2024 సార్వత్రిక ఎన్నికలకు పెద్ద ఎత్తున 82.77% శాతము ప్రజలు పోలింగ్ బూత్లకు కదలి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించుకున్న ప్రజలకు, సహకరించిన ముఖ్యంగా వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు, నియోజకవర్గం లో ఒక సంఘటన లేకుండా ప్రశాంతంగా మొన్న అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడం దానికి సహకరించిన పోలింగ్ అధికారులకు, పోలీసు సిబ్బందికి, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఆలూరు నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు మీద ఉన్న అత్యంత అభిమానంతో ఎమ్మెల్యే వీరభద్ర గౌడ్ మరియు ఎంపీగా నాగరాజు గార్లకు మంచి మెజారిటీ ఇచ్చిన ఆలూరు నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదు

- అసహనంతోనే హింసకు పాల్పడుతున్నారు
- స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర భద్రత పెంచాలి
- ఇసిని కోరిన జనసేన నేత నాగబాబు

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని.. అసహనంతోనే హింసకు పాల్పడుతున్నారని జనసేన నేత నాగబాబు అన్నారు. ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర భద్రత పెంచాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. హింసకు పాల్పడ్డ వైసీపీ నేతలే ఎన్నికల సంఘాన్ని, పోలీసులను నిందించడం విడ్డూరంగా ఉందని అన్నారు. దొంగే దొంగ అని అరిచినట్టుగా వైసీపీ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు.పోలింగ్ అనంతరం ఏపీలో నెలకొన్న హింసపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర భద్రతను మరింతగా పెంచాలని కోరారు. జూన్ 4న ఎన్నికల్లో వచ్చే ప్రజాతీర్పుతో వైసీపీ మరోసారి హింసకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఆ రోజున పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రంలో ఓటర్లు విజ్ఞతతో ఓట్లు వేశారని తెలిపారు. ఏపీ ఎన్నికల్లో 81.86 శాతం పోలింగ్ నమోదు కావడమే ఇందుకు నిదర్శనమని నాగబాబు పేర్కొన్నారు. కాగా.. పోలింగ్ తర్వాత తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, నరసరావు పేటలో చాలా హింసాత్మక ఘటనలు జరిగాయి. ఈ ఘటనలపై ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం సీఈఓ మీనా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అల్లర్లకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ డీజీపీని ఆదేశించారు. నాలుగు ప్రాంతాల్లో 144 సెక్షన్ పెట్టాం...అదనపు బలగాలు పంపించామని తెలిపారు. అభ్యర్థులు అందరినీ హౌస్ అరెస్టు చేయాలని అదేశాలిచ్చినట్లు చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని ఏపీ డీజీపీకు అదేశాలిచ్చారు. పలు జిల్లాల్లో జరిగిన ఘటనలు అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 715 ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని సీఈఓ ఎంకే మీనా పేర్కొన్నారు.

# ఎన్నికల అనంతర ఘటనలు దారుణం

**దారుణాల వెనక ఎవరున్నా కఠినంగా శిక్షించాలి**

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఓటరు తీర్పు ఇవిఎంలలో నిక్షిప్తమైంది. ఫలితాల వెల్లడి వరకు సంయమనం పాటించడం ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ముఖ్య బాధ్యత. ఎన్నికల అనంతరం ఘర్షణలు వాంఛనీయం కాదు. ఏ పార్టీ వారైనా ఇలాంటి ఘటనలతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయరాదు. దాడులు, దహనాలు, తగులబెట్టడాలు క్షమించరాని నేరం. ఇందులో ఏ పార్టీ వారు ఉన్నా కఠినంగా శిక్షించాల్సిందే. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎపిలో సుమారు 82శాతం పోలింగ్ జరగడం విశేషం. అలాగే సంక్రాంతి పండగకు తరలివచ్చినట్లుగా ఓటర్లు ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి ఓటేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. రాష్ట్రంలో భిన్న వాతావరణం ఉందని, చాలా చోట్ల తీవ్ర ఎండలు లేదంటే పిడుగులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. అయినప్పటికీ, పోలింగ్ కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు లేకున్నా... ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం గమనించాం. ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల ఉన్న విశ్వాసాన్ని, గౌరవాన్ని, చైతన్యాన్ని ఇది తెలియజేస్తుంది. ఎన్నికల యజ్ఞంలో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం పూర్తయింది. ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ, 175 శాసనసభ స్థానాల్లో కొన్ని హింసాత్మక సంఘటనలు, అక్కడక్కడ కొద్దిపాటి ఉద్రిక్తతలు మినహా ఓటింగ్ సజావుగా జరిగింది. అయితే ఎన్నికల అనంతర హింస కూడా ఆందోళన కలిగిస్తుంది. ఇలాంటి ఘటనలు మంచిది కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు, పార్టీలు సంయమనంతో ఉండాలి. ఎక్కడా రీపోలింగ్ అవసరం ఉండకపోవచ్చని ఎన్నికల సంఘం ప్రాథమికంగా పేర్కొన్నట్లుగానే జరిగింది. ఇవిఎంల మొరాయింపు, తమ ఓట్లు జాబితాల్లో లేవన్న ఫిర్యాదులు గతంతో పోల్చితే తక్కువే. ఎ.పి. వ్యాప్తంగా 4.14 కోట్ల ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, మహిళా ఓటర్లు 2.10 కోట్లు కాగా పురుషులు 2.02 కోట్లు. పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండటం ఒక విశేషం కాగా పోలింగ్ కేంద్రాల వద్ద స్త్రీలు బారులు తీరడం అంతకంటే పెద్ద విశేషం. పోలింగ్ సమయం సాయంత్రం ఆరు గంటలకు ముగియగా, అప్పటికి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించించారు. ఆ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 3,500 పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న వారి ఓటింగ్ పూర్తయ్యేసరికి రాత్రి పదిగంటలు దాటింది. కొన్నిచోట్ల అర్ధరాత్రి 12 గంటల వరకు ఓటేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో 78.41 శాతం ఓట్లు పోలయ్యాయి. 2019లో 79.64 శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పుడు 82శాతం ఓటింగ్ జరిగింది. గతం కంటే పోలింగ్ శాతం భారీఆ పెరిగింది. ఇది ఎవరికి అనుకూలమో అన్నది ఓట్ల లెక్కింపు రోజు తెలుస్తుంది. పోలింగ్ పెరగడం రాష్ట్రంలో ప్రభుత్వ మార్పునకు సంకేతమని టిడిపి కూటమి చెబుతుండగా, పథకాల లబ్ధిదారులు ఓటెత్తారని వైసిపి విశ్లేషిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ తమకు అనుకూలమంటే, పట్టణాల్లో తమకే అనుకూలం అని ఊహాగానాలు చేస్తున్నారు. ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాల్లో 2,387 మంది, లోక్‌సభ స్థానాల్లో 454 మంది పోటీ చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడతారు. పోలింగ్ ముగిసినప్పటికీ ఫలితాలు వెల్లడి కావడానికి, తమ భవితవ్యం తేలడానికి అభ్యర్థులు, పార్టీలు ఇంకా మూడు వారాలు వేచి చూడాలి. అప్పుడే ఓటరు తీర్పు బహిర్గతమవుతుంది. రాష్ట్రంలో వైసిపి, టిడిపి,జనసేనాబిజెపి కూటమి, కాంగ్రెస్, వామపక్షాలు, ఆప్, ఇండియా వేదిక అభ్యర్థులు పోటీలో ఉన్నారు. త్రిముఖ పోటీ ఉండటంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. అయితే పోస్టల్ బ్యాలెట్ విషయంలోనూ తీవ్ర లోపాలు కనిపించాయి. పోలింగ్ రోజున అనంతపురం, మాచర్ల, తెనాలి సంఘటనలపై సీరియస్‌గా తీసుకున్నట్లు ఇ.సి. వెల్లడించింది. ఎ.పి. వ్యాప్తంగా పోలింగ్ సందర్భంగా 120 హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయనీ తెలిపింది.

# గెలుపుపై బిజెపి ధీమా !

ఎన్నకలు తుది దశకు చేరుకుంటున్నాయి. నాలుగు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పటికే 270 సీట్లు సాధించామన్న ధీమాను హోంమంత్రి అమిత్ షా చెప్పుకొచ్చారు. తమ లక్ష్యం 400 సీట్లు కావడంతో మిగతా మూడు దశల్లో ఆ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అలాగే 75 ఏళ్ల వయో పరిమితి మోడీకి వర్తించదని కూడా చెప్పేశారు. మోడీకి వయసుతో నిమిత్తం లేదని ముందే ప్రకటించారు. అంటే బిజెపి గెలిస్తే 80 ఏళ్ల వరకు ఆయనే ప్రధానిగా ఉంటారని తేల్చేశారు. వేరే పార్టీలో ఇలా ప్రకటించడం అసాధ్యం. బిజెపి ఇద్దరు వ్యక్తుల పెత్తనంలో ఉన్న పార్టీ కనుక..రెండోవాడు అమిత్ షా కనుక వెంటనే ఇలాంటి ప్రకటన చేసేశారు. దీంతో రేపటి ఎన్నికల ఫలితాల తరవాత మోడీయే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఎన్‌డి పక్షాలు కూడా ఇదే నిర్ధారణలో ఉన్నారు. మోడీ నాయకత్వంపై ఎవరికీ అనుమానాలు లేవు. ఈ క్రమంలో వారణాసిలో మోడీ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. బిజెపి పరివారంతో పాటు, పాత మిత్రులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యరు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మోడీ ఎన్‌డిఎ నేతలను ఆహ్వానించడం విశేషం. బిజెపి సొంతంగా 200 సీట్లు కూడా సాధించదన్న విమర్శల నేపథ్యంలో ఎన్‌డిఎ నేతలను పక్కన పెట్టుకోవడం గమనించవచ్చు. ఒకవేళ అత్తెసరు మెజార్టీ వస్తే ఎన్‌డిఎ భాగస్వాములు కీలకంగా మారుతారు. మరోవైపు దేశంలో ఎన్నికలు కీలకదశకు చేరుకున్న వేళ కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు దూకుడు ప్రదర్శిస్తున్నారు. రాహుల గాంధీ భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రచారం చేస్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి చూస్తోందన్న ప్రచారం ఉధృతం చేశారు. రిజర్వేషన్లు ఉండవని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో బిజెపి పునాదులు కదులుతున్నాయని అంటున్నారు. ఇండియా కూటమిదే అధికారం అని చెబుతున్నారు. ఇక దేశంలో బిజెపి బలాలను సమీక్షిస్తే హిమాచల్ దెబ్బ తరవాత, కర్నాకటలో బిజెపికి ఎదురు దెబ్బ తగిలింది. కర్నాటకలో ఓడినా ఆత్మపరిశీలన చేసుకోలేదు. ఓటమికి ఓటర్లు లేదా..కులాలు, మతాలు కారణం కాదు. కేవలం బిజెపి అహంకారపూరిత రాజకీయాలు మాత్రమే అని గుర్తించలేకపోయింది.. అన్ని రాష్ట్రాల్లో పాగా వేస్తున్నామని.. మళ్లీ కేంద్రంలో అధికారం తమదే అన్న అహంకారంతో బిజెపి నేతలు ప్రజల ఆర్తనాదాలు వినిపించుకోవడలేదు. ప్రజల గురించి ఆలోచించచడం లేదు. బిజెపికి ఎందుకు ఓటేయాలో అన్న ఒక్క ప్రశ్న వేసుకుని ఇప్పుడు చర్చించుకోవాలి. ఎందుకు ప్రజలు ఆదరిస్తున్నారో..ఎందుకు తిరస్కరిస్తున్నారో గుర్తించాలి. బిజెపి ఏదో ఒరగబెడుతుందన్న భ్రమలో ఆదరించారు. ఏమీ ఒరగబెట్టడం లేదన్న సందర్భంలో ఓడిస్తున్నారు. అందుకే కర్నాటకలో బిజెపి మీద కసితో కాంగ్రెస్‌కు ఓటేశారు. ఆ తరవాత తెలంగాణలో కూడా అలాగే చేశారు. కాంగ్రెస్ ఏదో ఉద్దరిస్తుందన్న భ్రమతో కాకుండా..బిజెపిపై కోపంతో ఓటేశారు. అధికర ధరలు, పెట్రో, గ్యాస్ ధరల పెంపు, నిరుద్యోగ సమస్య, జిఎస్టీ వంటి భారాలపై ఎక్కడా చర్చ చేయడం లేదు. 400 సీట్లు గెలిస్తే ఈ సమస్యపై చర్చిస్తామని బిజెపి మిత్రద్వయం ఎక్కడా చెప్పడం లేదు. గతంతో పోలిస్తే కాంగ్రెస్‌ను విమర్శించడంతోనే ప్రచారం ముగించేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య గురించి ఆలోచన చేయడం లేదు. ప్రజలు ఏమనుకుంటున్నారో కూడా గమనించడం లేదు. వీటిపై పరిశీలన చేయడం అవసరం అన్న ధోరణి కానరావడం లేదు. ప్రజల సమస్యలపై చర్చించని పాలకులు తమకు వద్దు అన్న ధోరణిలో కర్నాటక ప్రజలు ఓ హెచ్చరిక చేశారు. ఆ తరవాత కెసిఆర్ తీరుకు నిరసనగా తెలంగాణలో కూడా ఇలాంటి తీర్పే ఇచ్చారు. ఇది ఒక్క బిజెపికే కాదు..ఆయా రాష్ట్రాల్లో పాలన చేస్తున్న అందరికి వర్తిస్తుంది. ప్రజలు తమకు అవకాశం వచ్చినప్పుడే ఉపయోగించుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు ఇవే అంశాలపై

నిలదీస్తున్నారు. ఇడి, సిబిఐలు దాడులు చేసి కేసులు నమోదు చేసి, నేతలను లోపల వేస్తున్నా..గత పదేళ్లలో ఒక్క అవినీతి కేసుల్లో ఒక్కటైనా తేల్చలేదు. ఒక్కరిపైనా శిక్షపడలేదు. నిజంగానే అవినీతి, అక్రమాలపై కేసులు పెట్టాల్సి వస్తే బిజెపి నుంచే మొదలు పెట్టాలి. కర్నాటకలో అక్రమాలకు పాల్పడ్డ వారిపైనా కేసులు పెట్టాలి. ఆదానీ అంబానీ వ్యవహారంలో మోడీ నిజాయితీని నిగ్గ తేల్చాలి. ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలపై చర్చ పెట్టాలి. సాగుచట్టాలను తీసుకుని వచ్చినప్పుడు కూడా మోడీ నిరంకుశంగా వ్యవహరించారు. బహుశా నియంతల పాలనలో కూడా ఇంతగా దారుణాలు జరిగి ఉండవు. ప్రజాస్వామ్యం లో నియంతృత్వం పనికారాదు. తెలంగాణ, ఎపిల్లోనూ పాలకలు నియంతలుగా మారారు. వేధింపులతో ప్రత్యర్థులను దెబ్బతీసే కుట్రలకు పాల్పడ్డారు. ఫలితంగగా తెలంగాణలో కెసిఆర్ నియంతృత్వాన్ని ప్రజలు ఓటుతో దెబ్బకొట్టారు. ఇవన్నీ గమనించి పాలకులు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజలు ప్రతీకార రాజకీయాలను ప్రజలు సహించబోరని గుర్తించాలి. ఇకపోతే భారత్‌ను బ్రహ్మాండంగా నడిపిస్తున్నామని బాకాలు ఊదుకుంటున్న బిజెపి నేతలు తమ విధానాలు పునసస్సమీక్షించుకోవాల్సిందే. ప్రజలు కోరుకుంటున్నదేదో గుర్తించాలి. ప్రజలకు భారంగా మారిన జిఎస్టీ, పెట్రో, గ్యాస్ ధరలను తగ్గించాలి. ఉచిత పథకాలను అటకెక్కించాలి. కుట్ర రాజకీయాలు పక్కన పెట్టాలి. భారీతీయ జనతా పార్టీలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి. మోడీ తన నిరంకుశ విధానాలను పార్టీలో చర్చించే అవకాశం ఇవ్వాలి.

# పత్తి విత్తనాలను విత్తుతున్న రైతులు





**మిడుతూరు, మే 15 (పీపుల్స్ మోటివేషన్):-**

పత్తి విత్తనాలను విత్తుతున్న రైతులు మిడుతూరు మండల కేంద్రంలోని వీపనగండ్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షంతో పత్తి విత్తనాలను విత్తడానికి పొలం అనుకూలంగా ఉంటుందని రైతులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం కురవడంతో విత్తనాలు బాగా మొలకెత్తుతాయనే ఆశతో ఉన్నామని పంట దిగుబడి కూడా అధికంగా వస్తుందని వారు తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారులు రైతులకు తగిన సూచనలు తెలిపారు.

# సరస్వతీ విద్యానికేతన్‌లో మెరిసిన విద్యార్థిని

- ఏపీ ఆర్ జె సిలో 429వ ర్యాంకు సాధించిన సరస్వతి విద్యానికేతన్ విద్యార్థిని



**దేవనకొండ, మే 15 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండలోని సరస్వతి విద్యానికేతన్ యూపీ స్కూల్‌కు చెందిన ఆవుల హమ్సిక వర్షని ఏపిఆర్జెసి ప్రవేశ పరీక్షలో జిల్లాస్థాయిలో ఓసి కేటగిరిలో 86 మార్కులు సాధించి 429వ ర్యాంకు సాధించి కర్నూలు జిల్లా బనవాసి ఏపీఆర్జేసీ స్కూలుకు పాఠశాలకు ఎంపిక కావడం జరిగింది. పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ కృష్ణమూర్తి మరియు ముజ్బుర్ రెహమాన్ తెలియజేయడం జరిగినది.

# కాచుకోండి.. గెలిచేది వైకాపానే

- చంద్రబాబు మోసాలు ప్రజలు నమ్మలేదు
- రాష్ట్రమంతటా ఫ్యాన్ గాలి వీచింది
- విశాఖలోనే జగన్ ప్రమాణస్వీకరం ఖాయం
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

**విశాఖపట్టణం,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఎన్నికల్లో వైకాపా విజయం ఖాయమయ్యిందని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, త్వరలోనే డేట్ ఫిక్స్ చేస్తామని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు తెలిసింది మోసం, దగా, కుట్రలు అని, మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ చెప్పింది చేస్తారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ఎన్ని హామీలు ఇచ్చినా ఏపీ ప్రజలు వారిని నమ్మలేదని, అందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటేశారని చెప్పారు. మే 13న జరిగిన ఏపీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి బలంగా వీచిందన్నారు. ఏపీ ఎన్నికలపై మంత్రి బొత్స మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల్లో సీఎం జగన్ ను మరోసారి ఆశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు. టీడీపీ కార్యకర్తలు ఓటమి తెలిసి, సహనం కోల్పోయి దాడులకు పాల్పడుతున్నారు. ఓడిపోతున్నారనే టీడీపీ నేతలు పల్నాడులో దాడులకు పాల్పడ్డారు.. మేం కనుక ఒక్క పిలుపు ఇచ్చి ఉంటే అంతా క్లోజ్. సచివాలయ వ్యవస్థను అవినీతి రూపు మాపడానికి పెట్టాం. కార్యకర్తలు ఎప్పుడూ నేతల పక్కనే ఉంటారు. మహాత్మా గాంధీ కలలు కన్న వ్యవస్థే సచివాలయ వ్యవస్థ. వాలంటరీ వ్యవస్థ కరోనా సమయంలో ఎన్నో సేవలు అందించింది. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సేవలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అందించారు వాలంటీర్లు. ఎన్నికల సమయంలో టీడీపీ సహనం కోల్పోయినా, మనం సంయనంగా వ్యవహరించాలని వైసీపీ కార్యకర్తలకు సూచించాం. జగన్ ను అధికారంలోకి తీసుకురావాలి. మహిళలు, యువత, పేద వర్గాలకు మరో ఐదేళ్లు సంక్షేమాన్ని కొనసాగిస్తాం. కవ్వింపులు జరిగినా మా కార్యకర్తలు సహనంగా ఉన్నందుకు ఏపీలో భారీగా పోలింగ్ నమోదైంది. తులసివనంలో గంజాయి మొక్కలా కొందరు జర్నలిస్టులు ఉంటారు. ప్రజాధరణ ఎక్కువగా ఉన్న కారణంగానే నన్ను టీడీపీ కూటమి నేతలు నన్ను టా÷-గ్గ÷ట్ చేశారు. అది మా బలంగా భావిస్తాం. కానీ అది టీడీపీ శ్రేణుల బలహీనత. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు నారా లోకేష్ నామినేటెడ్ పదవి తీసుకున్నాడు. కానీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా నెగ్గలేదు. చంద్రబాబు వదిన పురంధేశ్వరి మరో పార్టీలో అధ్యక్షురాలిగా ఉన్నారు. నందమూరి బాలకృష్ణ, ఆయన అల్లుళ్లు లోకేష్, భరత్ లు రాజకీయాల్లో ఉన్నారు. కుటుంబ పాలన ఎవరిదో ఇప్పుడు చెప్పండి. ఈవీఎంలు ఎక్కడ భద్రపరచాలి అనేది ఎలక్షన్ కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. కానీ వ్యవస్థ మీద అవగాహన లేక ఈవీఎంలపై కామెంట్లు చేస్తున్నారని' మండిపడ్డారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్స్ పెట్టవద్దని మంత్రి బొత్స సూచించారు. తాము గెలిచేస్తున్నామని టీడీపీ నేతలు ప్రచారం చేస్తే, అది నిజమని బెట్టింగ్ కాస్తే లక్షలు పోగొట్టుకుని, జీవితాలు కోల్పోతారని హెచ్చరించారు. జూన్ 4 వరకు ఆగితే ఫలితాలు ఎవరివైపు తేలుతుందని, వైసీపీ మరోసారి భారీగా సీట్లు సాధించి ఏపీలో అధికారంలోకి వస్తుందన్నారు. కేంద్రంలో ఎవరు వచ్చినా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమని మంత్రి బొత్స స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలు తప్ప, రాజకీయ ప్రయోజనాలు తమకు ముఖ్యం కాదన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ అనుమానాస్పద మృతి

**ములుగు,మే15(పీపుల్స్ మోటివేషన్):**

అంగన్వాడీ ఉపాధ్యాయిని హత్యకు గురైన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుజాత (48) మండలంలోని కాటాపురంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె విధులు ముగించుకుని తన స్వగ్రామమైన ఏటూరునాగారం బయలుదేరారు. బుధవారం ఉదయం తాడ్వాయి సమీపంలో అడవికి వెళ్లిన తునికాకు కూలీలకు సుజాత మఅతదేహం కనిపించింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# తగలబడుతున్న వేలాది ఎకరాల అడవి

**ప్రమాదంలో చమురు నిల్వలు!**

**ఫోర్ట్ మెక్‌ముర్రే,మే15(పీపుల్స్ మోటివేషన్):**

కెనడా అడవుల్లో అకస్మాత్తుగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాదాపు 25 వేల ఎకరాల్లో అడవి తగలబడిపోతుంది. పాలనా యంత్రాంగం మంటలను అదుపు చేయలేకపోయారు. సమీప ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. మంటలు కదులుతున్న దిశలో చమురు రిజర్వాయర్ ఉంది. కెనడాలో ఈ అగ్నిప్రమాదం ఇప్పుడు ఫోర్ట్ మెక్‌ముర్రే వైపు కదులుతోంది. మంటలు నివాస ప్రాంతాలు, చమురు నిక్షేపాల వైపు వేగంగా కదులుతున్నాయని మంగళవారం పరిపాలన తెలిపింది. వేడిగాలులు, పొడి వాతావరణమే అగ్నిప్రమాదానికి కారణమని చెబుతున్నారు. దట్టమైన అడవుల నుంచి చెలరేగిన మంటలు ఇప్పుడు పశ్చిమ కెనడాలోని ఆయిల్ టౌన్ ఫోర్ట్ మెక్‌ముర్రేకు చేరుతున్నాయి. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇక్కడ నాలుగు ప్రాంతాలకు చెందిన సుమారు 6000 మంది ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశించారు. చమురు నిక్షేపాల సమీపంలో మంటలు చెలరేగడంతో బుధవారం చమురు ధరలు పెరిగాయి. అగ్నిప్రమాదం తర్వాత, చమురు ధరలు బుధవారం పెరగడం ప్రారంభించాయి. ఇక్కడ రోజుకు 10 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి అవుతుంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 34 సెంట్లు పెరిగి 82.71 డాలర్లకు చేరుకుంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఫ్యూచర్ (%ఔ×%) బ్యారెల్‌కు 38 సెంట్లు పెరిగి 78.39డాలర్లకి చేరుకుంది. శివారు ప్రాంతాలైన అబాసాండ్, హిల్, బీకాన్, ప్రైరీ క్రీక్, గ్రేలింగ్ ప్రాంతాలకు కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. వేడి గాలి వేగం తగ్గకపోవడంతో మంటలు ఆ ప్రాంతమంతా గంటకు 40 కి.మీ వేగంతో వ్యాపిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు వీలైనంత త్వరగా ఇళ్లు ఖాళీ చేయాలని అధికార యంత్రాంగం ఆదేశించింది. 2016లో కూడా కెనడాలోని ఫోర్ట్ మెక్‌ముర్రే అడవిలో ఇలాంటి ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో దాదాపు 90 వేల మందిని సురక్షితంగా తరలించడంతో చమురు ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. 2016 అగ్నిప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఎల్సీ నిస్టర్ మాట్లాడుతూ, పరిపాలన తరలింపు ఆదేశాలు ఇవ్వని చోట కూడా ప్రజలు ఫోర్ట్ మెక్‌ముర్రేలోని ఇతర ప్రాంతాలను విడిచిపెట్టడం ప్రారంభించారు.

## ఖమ్మంలో రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

**ఖమ్మం,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట వద్ద ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన మృతులు సత్యనారాయణ, రుక్మిణి దంపతులు 75 ఏళ్ళు పైబడిన వారు కారులో ప్రయాణిస్తుండగా ఘటన జరిగింది. కారును నడుపుతున్న వ్యక్తి రోడ్డుపై రాంగ్ రూట్ లో వెళుతుండగా వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం తాకిడికి వాహనం దగ్ధమైంది. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారిని రక్షించారు. వృద్ధ దంపతులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బోనకల్ ఎస్ఐ మధుసూధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉంటే.. కరీంనగర్ జిల్లాలోనూ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శంకరపట్నం మండలం తాడికల్ లో డీజిల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. తాడికల్ బస్టాండ్ వద్ద నిలబడి ఉన్న ఆరుగురుని ట్యాంకర్ అదుపు తప్పి ఢీ కొట్టింది.. దీంతో.. పూదరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై ట్యాంకర్ బోల్తాపడగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. యాక్సిడెంట్ పై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. టాంకర్ డ్రైవర్ క్లీనర్ లను స్థానికులు గ్రామపంచాయితీలో బంధించారు. ఆస్పత్రికి తీసుకెళ్లిన వారి మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పల్నాడులో ఘోరం రోడ్డు ప్రమాదం

**ట్రావెల్ బస్సు ఢీకొట్టిన టిప్పర్**

**ఐదుగురు సజీవ దహనం**

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సొంత ఊరులో ఓటు వేసి మళ్లీ హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సులో కొంతమంది బయలుదేరారు. బస్సు కొంతదూరం వెళ్లగానే మృత్యువు టిప్పర్ రూపంలో దూసుకొచ్చింది. టిప్పర్ వెనుక నుంచి బస్సును బలంగా ఢీ కొట్టింది. వెంటనే చెలరేగిన మంటల్లో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో 20 మంది గాయపడ్డారు. అసలేం జరిగింది? మంగళవారం రాత్రి బాపట్ల జిల్లా నుంచి అరవింద ప్రైవేటు టావెల్స్‌కి చెందిన ఓ బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సులో ఎక్కువమంది చినగంజాం, గొనసపూడి, నీలాయపాలెం ప్రాంతానికి చెందినవారు ఎక్కువగా ఉన్నారు. వీరిలో చాలావరకు ఎన్నికల పోలింగ్‌కు హైదరాబాద్ నుంచి సొంతూర్లకు వచ్చారు. ఓటు వేసి తిరిగి బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటిగంటన్నర సమయంలో చిలకలూరిపేట సమీపంలోని ఈవూరివారిపాలెం వద్ద బస్సు వచ్చేసరికి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. క్షణాల్లో టిప్పర్‌కు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు కాస్త బస్సుకు అంటుకున్నాయి. నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకునే సరికి ఐదుగురు సజీవ దహనమయ్యారు. బస్సు డ్రైవర్‌తోపాటు నలుగురు ప్రయాణికులు కాలి బూడిదయ్యారు. మరో 20 మందికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆ ప్రాంతమంతా ప్రయాణికుల ఆర్తనాదాలతో విషాదంగా మారింది.వెంటనే స్థానికులు పోలీసులు, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లకు సమాచారం ఇచ్చారు. బస్సులో చిక్కుకుపోయినవారిని బయటకు తీశారు. 108 వాహనాల్లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈలోగా ఫైర్ ఇంజన్లు ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. టిప్పర్ అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపట్టారు. మరణించిన బాధితుల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి మరిన్ని వివరాలు సేకరించారు పోలీసులు.మరోవైపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. రాత్రి పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామంలో రహదారి పక్కన ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలు ఎగుమతి చేస్తుండగా కూలీలను ఢీకొట్టింది ఆర్టీసీ బస్సు. ఈ ఘటనలో అక్కడికక్కడే ఐదుగురి మృతి చెందారు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అంబులెన్స్‌లు ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు విచారణ మొదలుపెట్టేశారు.

## తొలిసారిగా 14 మందికి భారతీయ పౌరసత్వం

**సీఏఏ చట్టం ప్రకారం ద్వారా ధృవీకరణ పత్రాల జారీ**

**న్యూఢిల్లీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

పౌరసత్వ సవరణ చట్టం కింద మొదటిసారిగా 14 మందికి పౌరసత్వ ధృవీకరణ పత్రాలను జారీ చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సర్టిఫికేట్లను అందించారు. సీఏఏ ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర మైనారిటీలు అయిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రిస్టియన్స్, పార్సీలు, జైన మతస్తులకు ఈ చట్టం ద్వారా భారత పౌరసత్వాన్ని కల్పించనున్నారు. 2019లో ఈ చట్టం ఆమోదం పొందినప్పటికీ, ఇటీవలే దీనిని అమలులోకి తీసుకువచ్చారు. 2019లో సీఏఏని పార్లమెంట్ ఆమోదించింది. అయితే నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చి 11న కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (%వీనూ%) నిబంధనల నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత బుధవారం 14 మంది పౌరసత్వ ధృవీకరణ పత్రాలను పొందారు. సర్టిఫికెట్లను కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అందజేశారు. పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత సర్టిఫికేట్లు అందించారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా వివక్ష ఎదుర్కొంటున్న వారి కోసం 1955 పౌరసత్వ సవరణ చట్టాన్ని సవరించి సీఏఏని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది.

## స్పెక్ట్రమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన త్రిపుర గవర్నర్

**హైదరాబాద్,మే15(పీపుల్స్ మోటివేషన్):**

మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'స్పెక్ట్రమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్'ను త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్ ఇంద్రసేనారెడ్డి బుధవారం ప్రారంభించారు. మే 20 వరకు జరిగే ఈ ప్రదర్శనలో డ్రాయింగ్‌లు, ఆయిల్ పెయింటింగ్‌లు, ఎచింగ్‌లు, సిరామిక్ శిల్పాలు మరియు ఫైబర్ శిల్పాలతో సహా విభిన్న కళాత్మక వ్యక్తీకరణలు ఉన్నాయి. ఈ విభిన్న కళాకృతులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవాకు చెందిన ఏడుగురు నైపుణ్యం కలిగిన కళాకారులు %ళ్% రాజు, గోపాల్, క్రాంతి చారి, ప్రియదర్శన్, రాజేష్ చోడంకర్, శ్రీ హర్ష, వాసుదేయో శెట్యే రూపొందించారు. ప్రదర్శనలో ఉన్న కళాఖండాల లోతు అందాన్నిఇంద్రసేనారెడ్డి ప్రశంసించారు. కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతకు తన ప్రశంసలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కళాకారుడు పి.వై.రాజు మాట్లాడుతూ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం ప్రారంభమైన %య్రాజుజు=ఖవీ% ఆర్ట్ ఎగ్జిబిషన్ ఈ నెల 20 వరకు కొనసాగుతుందని.. ఎగ్జిబిషన్ కు వచ్చిన వారిని ఆయన ఆహ్వానించారు. ఇది కూడా చదవండి %-% నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికకు బీజేపీ సిద్ధమైంది. తాము ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినందుకు ఏడుగురు కళాకారులు త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తాము ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినందుకు ఏడుగురు కళాకారులు త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.34000 కోట్ల కుంభకోణం

- **దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం**
- **17 బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో మోసం**
- **డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ అరెస్ట్**

**న్యూఢిల్లీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34000 కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధావన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు.డిహెచ్ఎఫ్ఎల్ సిఎండి కపిల్ వాధావన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. 17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా చార్జ్ షీట్‌లో చేర్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన %ూ×=, ఖఎఖీూ% కపిల్ వాధావన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధావన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది. నేరపూరిత కుట్ర చేసి రూ.42,871.42 కోట్ల రుణం ఇవ్వాలని ఈ బ్యాంకులను కోరింది. భారీ మొత్తంలో రుణం తీసుకుని దుర్వినియోగం చేశారు. సీబీఐ ప్రకారం.. జూలై 31, 2020 నాటికి 17 బ్యాంకుల కన్సార్టియం బకాయిల కారణంగా రూ. 34615 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## రైతులకు అందుబాటులో పత్తి విత్తనాలు ఉంచాలి

**అధికారులను మంత్రి తుమ్మల ఆదేశం**

**హైదరాబాద్,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఖరీఫ్ 2024లో రాష్ట్రంలో దాదాపు 60.53 లక్షలలో ప్రత్తి సాగు కాగలదని వ్యవసాయశాఖ అంచనా వేయగా, దానికి సరిపడా %దీ+××% పత్తి విత్తనాలను మే చివరి నాటికి రైతులకు అందుబాటులో ఉంచే ఏర్పాటు చేసుకోవల్సిందిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 2021లో 60.53 లక్షలు ఉన్న ప్రత్తి విస్తీర్ణము క్రమముగా తగ్గుతూ 2023లో 45.17 లక్షలకు వచ్చిందనీ, ఐనప్పటికీ ప్రపంచ మార్కెట్లో ప్రత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణము పెరిగే అవకాశముందని దానికి తగ్గట్లు %దీ+××% విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించారు. గతేడాది 90 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోగా, ఈసారి 120 లక్షల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు.ఇప్పటికే రెండు దఫాలు సంబంధిత అధికారులు, విత్తన కంపెనీలతో సమావేశం జరిపి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేంద్రప్రభుత్వం ఈసారి ప్రత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ. 864.00 గా నిర్ణయించిదని, ఏ ఒక్క డీలరైనా, అంతకంటే ఎక్కువధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే ఏ కంపెనీని ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలకు భంగం కల్గించే ఏ చర్యను ఈ ప్రభుత్వం సహించబోదని, విధులపట్ల అలసత్వం వహించినా అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు.

## కోవిడ్ వ్యాక్సిన్ తర్వాత శరీరం పనిచేయడం లేదు

- **కోవిడ్ వ్యాక్సిన్ పై మహిళ కేసు నమోదు**

**న్యూఢిల్లీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఆస్ట్రాజెనాకా వ్యాక్సిన్‌పై మరో మహిళ దావా వేసింది. క్లినికల్ ట్రయల్స్ సమయంలో ఇచ్చిన వ్యాక్సిన్ తనను పూర్తిగా వికలాంగురాలిగా మార్చిందని మహిళ చెప్పింది. ఇప్పుడు ఆమె శరీరం మునపటిలా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సంస్థ వైద్యం అందించడం లేదని ఆరోపించింది. విశేషమేమిటంటే బ్రిటన్‌లో ఇప్పటికే 50 మందికి పైగా ఆస్ట్రాజెనెకాపై దావా వేశారు. 42 ఏళ్ల బ్రే డ్రెస్సెన్ అమెరికాలో ఆస్ట్రాజెనెకా కోవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్‌లో పాల్గొన్నారు. 2020 లో విచారణలో పాల్గొన్న తర్వాత.. అతను తీవ్రమైన నరాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ బ్రిటిష్ వ్యాక్సిన్‌ను అమెరికాలో పరీక్షించారు. కానీ ఉపయోగం కోసం ఆమోదించబడలేదు. పరిశోధన ఫలితంగా తగిలిన గాయాల చికిత్సకు కంపెనీ చెల్లిస్తుందని వాగ్దానం చేసిన కంపెనీతో తాను ఒప్పందం కుదుర్చుకున్నానని డ్రెస్సెన్ పేర్కొన్నారు.నవంబర్ 2020 లో వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత.. ఆమె తన శరీరమంతా ముడతలు పడటం ప్రారంభించిందని మహిళ చెప్పింది. దీని తరువాత కూడా అస్ట్రాజెనెకా తన చికిత్స కోసం చేసిన ఖర్చులను చెల్లించలేదు. పెరిఫెరల్ న్యూరోపతితో బాధపడుతున్న తర్వాత తాను పని చేయలేకపోతున్నానని ఆమె వార్తాపత్రికతో చెప్పింది. "నేను వ్యాక్సిన్ కారణంగా నా ఉద్యోగాన్ని కోల్పోయాను. ఇప్పటికీ వైకల్యంతో ఉన్నాను" అని డ్రెస్సెన్ చెప్పారు. 'వారంలో ఏడు రోజులూ రోజుకు 24 గంటలూ తల నుంచి కాలి వరకు నా శరీరమంతా సూదులు గుచ్చినట్లు అనిపిస్తుంది' అని ఆమె చెప్పింది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత తాను చాలాసార్లు ఆసుపత్రిలో చేరానని, దాని వల్ల బిల్లు వేల డాలర్లకు చేరుకుందని ఆమె చెప్పింది. మానసిక క్షోభ, ఆదాయ నష్టం, రవాణా, న్యాయపరమైన రుసుములను క్లెయిమ్ చేస్తోంది. మహిళ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

## కారులో మంటలు చెలరేగి దంపతుల మృతి

**ఖమ్మం,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఖమ్మం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి చెందారు. కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న వృద్ధ దంపతులు సూర్యనారాయణ, రుక్మిణి అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బోనకల్ మండలం ముష్టికుంట్ల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాయాలతో అపస్మారక స్థితిలో యువకులిద్దరినీ ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వృద్ధ దంపతులు మామిళ్లగూడేనికి చెందినవారిగా గుర్తించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం । మే । 16 । 2024



# అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి..?

- నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుంది
- ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

అడవుల్లో మంటలు చెలరేగడం, వాటిని అదుపు చేసే విషయమై ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి బుధవారం సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. శుక్రవారం రోజు తమ ముందు హాజరై అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి..? వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుందోననే అంశాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. భారీ స్థాయిలో చెలరేగుతున్న మంటలను అరికట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. అదేవిధంగా అడవుల్లో మంటలు మండుతున్న వేళ ఎన్నికల విధుల్లో అటవీ అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించారని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయితే, ఉత్తరాఖండ్ అడవులల్లో భారీగా కార్చిచ్చులు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికే చాలా వరకు అటవీ మంటల్లో దగ్ధమైందని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలివ్వాలని పిటిషనర్లు కోరారు. దీనిపై గురువారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. ఉత్తరాఖండ్ అటవీ ప్రాంతంలో భారీ స్థాయిలో మంటలు చెలరేగుతున్నా అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు..? ఆ మంటలను ఆర్పివేసేందుకు అవసరమైన అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించలేదని.. ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ ? ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.అయితే, అగ్విమాపక సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతుందని, మంటల(కార్చిచ్చులు)ను ఆర్పివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందడంలేదని ఆ రాష్ట్ర తరఫున న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మే 17న ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధర్మాసనం ముందు హాజరై, ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# భారత్‌కి ప్రధాని మోడీ నాయకత్వం అవసరం

- వక్ఫ్ బోర్డు చైర్మన్ సంచలన వ్యాఖ్యలు

**ఉత్తరాఖండ్,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి ఉత్తరాఖండ్ వక్ఫ్ బోర్డు చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం యుద్ధం అంచున ఉన్న ఈ తరుణంలో భారత్‌కి ప్రధాని మోడీ బలమైన నాయకత్వం అవసరమని బుధవారం అన్నారు. "ప్రపంచమంతా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. వివిధ దేశాల్లో గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి సమయంలో భారత్‌కి మోడీ వంటి బలమైన నాయకత్వం అవసరం. ఆయన మూడోసారి అధికారంలోకి రావాలి. ఈ తరుణంలో నాయకత్వం బలహీనమైన వారి చేతిలోకి వెళ్తే దేశం నష్టపోతుంది" అని వక్ఫ్ బోర్డు చైర్మన్ షాదాబ్ షామ్స్ అన్నారు. సోమవారం హరిద్వార్‌లోని పిరాన్ కలియార్‌లో సాబీర్ సాహెబ్ దర్గా వద్ద ముస్లిం కమ్యూనిటీ సభ్యులతో కలిసి ప్రధాని మోడీ కోసం షాదబ్ చాదర్ సమర్పించారు. భారత అభివృద్ధి చెందేందుకు వరసగా మూడోసారి ఆయన అధికారంలోకి రావాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ హయాంలో అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాయని ఆయన అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు చివరి వ్యక్తికి కూడా చేరుతున్నాయని, మరుగుదొడ్డి, సొంత ఇళ్ల వంటి కలలు నెరవేరుతున్నాయని చెప్పారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని షాదాబ్ అన్నారు. విపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ప్రధాని మోదీ నాయకత్వంలో ముస్లింలకు గానీ, భారత రాజ్యాంగానికి గానీ ప్రమాదం లేదని ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన చెప్పారు. రాజ్యాంగానికి కానీ, ముస్లింలకు కానీ ఎలాంటి ముప్పు లేదని, కొందరు రాజకీయ నాయకుల దుకాణం మాత్రమే ప్రమాదంలో పడిందని, దేశ ప్రజల్ని, ముస్లింలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

# త్వరలోనే మిగితా రెండు గ్యారెంటీలు

**విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల,మే15(పీపుల్స్ మోటివేషన్):**

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల గడువులోపలే 6 గ్యారెంటీలలో 4 గ్యారెంటిలను అమలు చేయడం జరిగింది, మిగిలిన రెండు గ్యారెంటీలను త్వరలోనే అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన టెంపుల్ సిటీ అభివృద్ధి, పాల్ టెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మణం వంటి తదితర సమస్యలను తీసుకెళ్ళడం జరిగిందని, పత్తిపాక రిజర్వాయర్, రోళ్ళ వాగు ప్రాజెక్ట్ లను పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరు అందిస్తామని ఆయన తెలిపారు. పెద్దపెల్లి పార్లమెంట్ ఎంపి ఎన్నికల్లో గడ్డం వంశీ బారి మేజరితో గెలుపొందుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోపు రాష్ట్రంలో ఉన్న రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని ఆయన తెలిపారు. మిల్లర్లు 5నుండి 6 కిలోలు తాలు తప్ప పేరుతో కటింగ్ చేస్తుంటే ఒక మంత్రి హొదాలో ఉన్నప్పుడు కొప్పుల ఈశ్వర్ కనీసం ఒక మాట అయిన మాట్లాడలేదని, ఈ రాష్ట్రాన్ని 10 సంవత్సరాల పాటు పాలించి, ఉద్యమ పార్టీగా పేరు పొంది, %ట=ా% ని %దీ=ా% గా మార్చిన పార్టీ నాలుగు నెలలకే అస్త్ర సన్యాసం స్వీకరిస్తుందని మేము అనుకోలేదన్నారు అడ్లూరి లక్ష్మణ్.

# ఏపీలో మరోసారి వైసీపీదే అధికారం..

- చంద్రబాబు ఫ్రస్టేషన్ అర్థమైతుంది..!
- మంత్రి మేరుగ నాగార్జున

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తుంది అని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఇది పేదలకు పెత్తందారులకు మద్య జరిగిన యుద్ధం.. ప్రజలు నిజమైన నాయకుడికి పట్టం కట్టబోతున్నారు.. జూన్ నాలుగోవ తేదీన వైసీపీ సునామీ రాబోతుంది.. చంద్రబాబు ఫ్రస్టేషన్ లోకి వెళ్ళాడు.. పల్నాడు జిల్లాలో వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారు.. సమస్యాత్మక ప్రాంతాల్లో సెక్యూరిటీ పెంచాలని కోరినా కూడా ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు అని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై చంద్రబాబు ఎన్నికలలో అక్రమాలకు పాల్పడ్డారు.. పోలీసులు టీడీపీకి కొమ్ము కాశారు.. అధికారంలోకి రాగానే ఎన్నికల్లో అక్రమాలకు వంతపాడిన పోలీసు అధికారులపై విచారణ జరిపిస్తాం అని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు.అలాగే, ఘోరాతి ఘోరంగా ఎన్నికల్లో టీడీపీ నేతలు దాడులు చేశారు అని మేరుగ నాగార్జున మండిపడ్డారు. జూన్ 4వ తేదీన రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం లిఖిస్తాం.. రాష్ట్రంలో రామరాజ్యం రాబోతుంది.. పేదలు వైసీపీకి ఓటు వేశారని దాడులు చేస్తున్నారు.. వైసీపీకి అండగా నిలిచిన ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలపై పని గట్టుకొని టీడీపీ దాడులకు ఉసిగొల్పింది.. డీబీటిల ద్వారా నిధులు ప్రజల ఖాతాల్లోకి రాకుండా టీడీపీ అధినేత నారా చంద్రబాబే అడ్డుకున్నది అని మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు.

# దాడి ఘటనలో స్వాతి మలివాల్‌తో ఆప్ సెటిల్‌మెంట్..?

**న్యూఢిల్లీ,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఆయన పీఏ బిభవ్ కుమార్ స్వాతి మలివాల్‌పై దాడి చేశాడు. ఆమెతో పీఏ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ క్లారిటీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలివాల్‌పై జరిగిన దాడిపై ఆప్ స్పందించిన ఒక రోజు తర్వాత సంజయ్ సింగ్, స్వాతి మలివాల్ నివాసంలో ఆమెను బుధవారం కలిశారు. సంజయ్ సింగ్ వెంట ఢిల్లీ మహిళా కమిషన్ సభ్యురాలు వందన కూడా ఉన్నారు. ఈ దాడి ఘటనలో స్వాతి మలివాల్‌తో సెటిల్‌మెంట్ కోసమే వీరిద్దరు ఆమె నివాసానికి వెళ్లారనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సిబ్బంది తనపై దాడికి పాల్పడ్డారని ఆప్ రాజ్యసభ ఎంపీ మలివాల్ సోమవారం ఆరోపించారు. దీనిపై పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, దీనిపై స్వాతి మలివాల్ అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. ఈ ఘటన జరిగిన ఒక రోజు తర్వాత ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ బిభవ్ కుమార్ మలివాల్‌తో "అనుచితంగా ప్రవర్తించారు" మరియు ఈ విషయంలో ఆప్ అధినేత కఠిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. "స్వాతి మలివాల్ కేజ్రీవాల్‌ని కలిసేందుకు అతని నివాసానికి వెళ్లారు. అయితే ఆమె డ్రాయింగ్ రూంలో కూర్చుని ఉండగా బిభవ్ కుమార్ ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. ఇది అత్యంత ఖండించదగిన సంఘటన" అని సంజయ్ సింగ్ అన్నారు. అయితే, ఈ వ్యవహారం ఆప్ వర్సెస్ బీజేపీగా మారింది. దీనిపై ఫిర్యాదు నమోదు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. కేజ్రీవాల్ సహాయకుడిని తొలగించాలని బీజేపీ డిమాండ్ చేయడంతో పాటు కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు, మహిళా మోర్చా బుధవారం కేజ్రీవాల్ నివాసం ముందు నిరసనకు దిగారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సీఎం కేజ్రీవాల్ మౌనాన్ని ప్రశ్నించారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్‌గా పని చేసిన ఓ మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా.. ఆమెకు మద్దతు ఇచ్చేందుకు మేం ఉన్నామని, ఈ ఘటనను ఆప్ నేత సంజయ్ సింగ్ అంగీకరించారని, కేజ్రీవాల్ నిందితుడిపై ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని సచ్‌దేవా ప్రశ్నించారు.

# నేటినుండి ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు

- పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024 (ఈఏపీసెట్) పరీక్షలు నేటినుండి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి బుధవారం (మే 15) ఓ ప్రకటనలో తెలిపారు. బైపీసీ గ్రూపుకి ఈఏపీసెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. మే 18 వ తేదీ నుంచి 23 వరకు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు జరుగుతాయన వెల్లడించారు. ఆయా తేదీల్లో రోజుకి రెండు సెషన్స్ లో పరీక్షలు జరుగుతాయని తెలిపానే. పరీక్షలు ఆన్‌లైన్ మోడ్ లో మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. మార్నింగ్ షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మద్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండవ సెషన్ పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈఏపీసెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 140 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ లో రెండు సెంటర్లు ఏర్పాటు చేశామని హేమచంద్రారెడ్డి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,61,640 మంది పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో అమ్మాయిలు 1,81,536 మంది ఉండగా.. అబ్బాయిలు 1,80,104 మంది వరకు ఉన్నట్లు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి ఎంపీసీ విభాగంలో 34,828 మంది అదనంగా దరఖాస్తు చేదుకున్నట్లు తెలిపారు. ఇక బైపీసీ విభాగంలో మాత్రం 13,138 మంది విద్యార్థులు గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువగా దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఒక నిమిషం నిబందన పక్కాగా అమలు చేస్తామని, ఏ రకమైన ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకు రాకూడదని హెచ్చరించారు. పరీక్షా కేంద్రంలోపలికి విద్యార్థులని అరగంట ముందుగానే అనుమతి ఇస్తామని తెలిపారు. ఈఏపీసెట్ పరీక్షలు ముగిసే వరకు పరీక్షా కేంద్రాలకి బస్‌లు నడపాలని ఆర్టీసీకి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందని, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్, కాకినాడ జేఎన్‌టీయే వీసీ ప్రొఫెసర్ ప్రసాదరాజు మాట్లాడుతూ..ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఒక నిమిషం నిబంధన పక్కాగా అమలు చేస్తాం. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకి ముందుగానే చేరుకోవాలి. ఇప్పటికే విద్యార్థులకి హాల్ టికెట్లను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచాం. విద్యార్థులెవరూ ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు.

# సీఎస్ జవహర్ రెడ్డితో డీజీపీ అత్యవసర భేటీ

- హింసాత్మక ఘటనలపై ఈసికి వివరణపై సమావేశం

**అమరావతి,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డితో అత్యవసరంగా సమావేశం అయ్యారు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ ఏడీజీ కుమార్ విశ్వజిత్ కూడా పాల్గొన్నారు.. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతర హింసాత్మక ఘటనలపై సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ) సీరియస్ కావటం.. ఢిల్లీకి వచ్చి వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో.. ఈ అత్యవసరం భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.. ఇక, ఏపీలో ఎన్నికల సమయంలో.. ఆ తర్వాత చెలరేగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వివరణ ఇచ్చేందుకు రేపు ఢిల్లీ వెళ్లనున్నారు సీఎస్, డీజీపీ..అయితే, ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు జరిగేలా పాలనా వ్యవస్థ విఫలం కావడానికి కారణాలేమిటని కేంద్ర ఎన్నికల సంఘం ప్రశ్నించిన విషయం విదితమే.. ఎన్నికల్లో హింసాత్మక ఘటనలకు బాధ్యులు ఎవరని సీఎస్, డీజీపీలను ప్రశ్నించింది ఈసీ. హింసాత్మక ఘటనల తర్వాత నివారణా చర్యలు ఏం తీసుకున్నారంటూ అధికారులను ప్రశ్నించిన విషయం విదితమే.. ఈ అంశాలపై అత్యవసరంగా భేటీ అయిన డీజీపీ, సీఎస్, ఇంటెలిజెన్స్ ఏడీజీలు.. ఏపీలో జరిగిన హింసాత్మక ఘటనలు.. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాల్సిన వివరణపై చర్చించినట్టుగా తెలుస్తోంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల తరుణంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై సీరియస్ అయ్యింది సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ) ఏపీలో ఎన్నికల నిర్వహణ, పోల్ అనంతర హింసపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఈసీ.. సున్నిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరుగుతాయన్న సమాచారం ఉన్నా.. ఎందుకు ఈ స్థాయిలో హింస చేలరేగుతోందని మండిపడింది.. సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాలకు సమన్లు జారీ చేసింది.. హింసాత్మక ఘటనలు, వాటికి అరికట్టడంలో జరిగిన వైఫల్యాలపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.. అంతేకాదు.. ఢిల్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్ పేర్కొన్న విషయం విదితమే.

# అంగన్‌వాడీ టీచర్ దారుణ హత్య

**ములుగు,మే15(పీపుల్స్ మోటివేషన్):**

ములుగు జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ మృతిని దారుణ హత్యగా గుర్తించారు. ఆమె మెడకు స్కార్ఫ్‌ను చుట్టి ఊపిరాడకుండా చేసి హతమార్చినట్లు గుర్తించారు.ఈ సంఘటన ములుగు జిల్లా తడ్వాయి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుజాత(48) అనే మహిళ కాటాపురంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నది. కాగా, మంగళవారం ఆమె విధులు ముగించుకొని తన స్వగ్రామమైన ఏటూరునాగారం బయలుదేరారు. అయితే బుధవారం తాడ్వాయి సమీపంలోని అడవిలో తునికాకు కోసం వెళ్లిన కూలీలకు సుజాత మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుజాతకు చెందిన నాలుగు తులాల బంగారం, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు సీఐ శంకర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation




# డబుల్ ఇస్మార్ట్ టీజర్ విడుదల

రామ్ పోతినేని, పూరి జగన్నాథ్ కాంబినేషన్ లో 2019లో 'ఇస్మార్ట్ శంకర్' సినిమా పెద్ద విజయం సాధించింది. అటు రామ్ కీ, ఇటు పూరి జగన్ కి ఆ సినిమా ఒక పెద్ద బ్రేక్ ఇవ్వటమే కాకుండా, ఎన్నాళ్ళ నుండో విజయం కోసం ఎదురు చూస్తున్న పూరి జగన్ ఆ సినిమాతో మళ్ళీ ఫార్మ్ లోకి వచ్చారు. ఆ సినిమాలో రామ్ తెలంగాణ యాస మాట్లాడి ఒక మాస్ పాత్రలో ప్రేక్షకులని ఎంతగానే ఆకట్టుకున్నారు. పూరి జగన్ ఆ సినిమాలో రామ్ కి ఎంత హైప్ ఇవ్వాలో అంత ఇచ్చి, రామ్ కెరీర్ లో 'ఇస్మార్ట్ శంకర్' ఒక మరపురాని చిత్రంగా మలిచారు. మళ్ళీ ఈ ఇద్దరి కాంబినేషన్ లో ఇప్పుడు ఆ సినిమాకి సీక్వెల్ గా 'డబుల్ ఇస్మార్ట్' అని సినిమా చేస్తున్నారు. ఈ సినిమా ఇప్పుడు చిత్రీకరణ దశలో వుంది, రామ్ పోతినేని పుట్టినరోజు సందర్భంగా ఆ సినిమా నుండి ఒక టీజర్ ను విడుదల చేశారు. రామ్ కి ఈ 'డబుల్ ఇస్మార్ట్' మళ్ళీ ఒక మంచి బ్రేక్ ఇస్తుందని అనుకుంటున్నారు. ఎందుకంటే 'ఇస్మార్ట్ శంకర్' తరువాత రామ్ సినిమాలు అంతగా బాక్స్ ఆఫీస్ దగ్గర నడవలేదు. ఇప్పుడు ఈ 'డబుల్ ఇస్మార్ట్' పైనే ఆశలు పెట్టుకున్నారు. ఇంకో పక్క దర్శకుడు పూరి జగన్నాథ్ కూడా ఈ సినిమాతో మళ్ళీ విజయం సాధించాలని చూస్తున్నారు. అందుకనే ఈ సినిమాపై దృష్టి పెట్టి ఎలా అయినా మళ్ళీ ఫార్మ్ లోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈరోజు ఈ సినిమానుండి విడుదలైన టీజర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అవుతోంది. ఒక్క తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ టీజర్ విడుదలైంది. బాలీవుడ్ కి చెందిన సంజయ్ దత్ ఇందులో ప్రతినాయకుడిగా నటిస్తుండగా, కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది.

# గేమ్ ఛేంజర్ షూట్ పూర్తి చేసే పనిలో రామ్‌చరణ్

చాలా రోజులుగా సెట్స్‌పై ఉన్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. సినీ ప్రేమికులు... అభిమానులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతుండడం.... అందులోనూ శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమా అంటే... అందులో భారీ హంగులు ఖాయం. వాటిని పక్కాగా తెరపైకి తీసుకు రావడంలో ఏమాత్రం రాజీపడరు శంకర్. అందుకే ఈ సినిమా చిత్రీకరణ ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలంగా ఈ సినిమాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు రామ్‌చరణ్. శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. తుదిదశకు చేరుకున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇటీవలే రామోజీ ఫిల్మ్‌సిటీలో కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ప్రస్తుతం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణని పూర్తి చేసి, వచ్చే నెల నుంచి కొత్త సినిమా చిత్రీకరణ కోసం రంగంలోకి దిగనున్నారు రామ్‌చరణ్. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న ఆ సినిమా ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. 'గేమ్‌ఛేంజర్' పూర్తయిన వెంటనే, కొత్త సినిమాకి తగ్గట్టుగా లుక్ మార్చుకుని, ఆ వెంటనే సెట్‌లోకి అడుగు పెట్టనున్నారు.






# మమ్ముట్టి సినిమాలో నయనతార

అద్భుతమైన నటన.. ఆకర్షించే అందంతో సినీప్రియుల్ని మెప్పిస్తుంది అందాల తార నయనతార. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈమె.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తుంది. మలయాళ అగ్రకథానాయకుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఓ చిత్రంలో నయనతార కథానాయికగా ఎంపికైనట్లు సమాచారం. 'ప్రముఖ దర్శకుడు గౌతమ్ మేనన్.. మమ్ముట్టితో కలిసి ఓ చిత్రాన్ని రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో ఆయనతో జోడీ కట్టడానికి నయన్‌తో చర్చలు జరుపుతోంది చిత్రబృందం. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నార'ని సన్నిహిత వర్గాలు తెలిపాయి. మమ్ముట్టి, నయన్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుతియా నియమమ్' మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులను ఎలా మెప్పించనుందో చూడాలి. ప్రస్తుతం 'డియర్ స్టూడెంట్స్' చిత్రీకరణలో ఉంది నయన్.



# ఫ్రీజింగ్ ఎగ్స్‌పై తప్పుడు వార్తలు

**అసమనం వ్యక్తం చేసిన నటి మెహరీన్**

తన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని నటి మెహరీన్ పిర్జాదా మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా వారు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. ఇటీవల ఆమె 'ఎగ్ ఫ్రీజింగ్' గురించి వివరిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. దానిపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు రాశాయి. తాజాగా ఈ విషయంపై స్పందించిన మెహరీన్.. అసహనం వ్యక్తం చేశారు. 'కొన్ని మీడియా సంస్థల్లో పనిచేసే వారు వారి వృత్తిని గౌరవించాల్సిన అవసరం ఉంది. అర్థం చేసుకుని వార్తలను ప్రచురించండి. తప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించడం అనైతికమే కాదు.. చట్ట విరుద్ధం. ఇటీవల నేను పెట్టిన 'ఫ్రీజింగ్ ఎగ్స్' పోస్ట్‌పై కొందరు రకరకాల వార్తలు రాశారు. నేను ధైర్యం చేసి ఈ విషయం గురించి మాట్లాడాను. ఫ్రీజింగ్ ఎగ్స్ కోసం అమ్మాయిలు గర్భవతులు కావాల్సిన అవసరం లేదు. బాధ్యతయుతమైన సెలబ్రిటీగా కొందరికి దీని గురించి అవగాహన కల్పించడం కోసం పోస్ట్ పెట్టాను. పిల్లలు అప్పుడే వద్దని భావించే తల్లి దండ్రులకు ఎగ్ ఫ్రీజింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి తెలియకుండా మీ స్వార్థం కోసం తప్పుడు కథనాలు రాశారు. నేను ప్రెగ్నెంట్ అని ప్రచారం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాపై పెట్టిన పోస్ట్‌లను తొలగించండి. బహిరంగ క్షమాపణలు చెప్పండి' అని మెహరీన్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. నెటిజన్లు ఆమెకు సపోర్ట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com